
# బీఎల్ మార్క్ ట్విస్ట్

## కేసీఆర్ కు బిగ్ షాక్.. ఫామ్ హౌజ్ కేసు తెరపైకి..

గువ్వల బాలరాజు సాక్షి.. కేసీఆర్ కల్పితకథగా తేల్చేయత్నం?
గతంలో బిఎల్ సంతోష్ పై కేసు నమోదుచేయించిన కేసీఆర్
సిట్ ద్వారా అరెస్ట్ చేయించేందుకు విఫలయత్నం
కనబడుట లేదంటూ హైదరాబాద్ సిటీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు
ఐదునెలలు వెంటపడ్డ కేసీఆర్.. జాతీయ స్థాయి ప్రచారానికి ప్రయత్నం
తమ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరికీ వందకోట్లు ఆఫర్ చేశారని కేసీఆర్ వరుస ప్రెస్ మీట్లు
జాతీయస్థాయిలో బిజెపి, బిఎల్ సంతోష్ టార్గెట్ గా వరుస ప్రచార కార్యక్రమాలు
తెలంగాణలో తనను ప్రతి ఇంటికీ కేసీఆర్ తీసుకెళ్ళాడని ఆవేదన చెందిన సంతోష్
గత కొంతకాలంగా బీఎల్ టీమ్ కు టచ్ లో బాలరాజు.. ఇపుడు విస్ఫోటనం




**హైదరాబాద్, మహా**

తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనానికి రంగం సిద్ధమైంది. గత కొద్దిరోజులుగా కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కుంభకోణం వంటి ఆరోపణలు విచారణలతో ఆందోళన చెందుతున్న కేసీఆర్ కు బీజేపీ సంస్థాగత జాతీయ ప్రధానకార్యదర్శి బీఎల్ సంతోష్ షాక్ ఇచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. బిఆర్ఎస్ కీలకనేత, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరడం వెనుక మాస్టర్ మైండ్ బిఎల్ సంతోషేనన్న ప్రచారముంది. ఫామ్ హౌజ్ కేసులో కేసీఆర్ కథారచన చేసి తనను అనవసరంగా వివాదంలోకి లాగి, తనను అరెస్ట్ చేయాలన్న పట్టుదలతో వెంటపడ్డారన్న ఆవేదనలో బిఎల్ సంతోష్ ఉన్నట్లు పలుమార్లు స్పష్టమైంది. అంతర్గత రాజకీయాలకే పరిమితమై కొద్దిమంది పార్టీ ముఖ్యులకు మాత్రమే తెలిసిన తనను రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కేసీఆర్ తీసుకెళ్ళాడని అరెస్ట్ నుండి ఉపశమనం పొందాక బిఎల్ సంతోష్ వ్యాఖ్యానించాడు. వరుసగా ఐదు నెలలు బిఎల్ సంతోష్ ను అరెస్ట్ చేసేందుకు సిట్ ఏర్పాటుచేసి ప్రయత్నించారన్న ఆరోపణలున్నాయి. పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌజ్ లో రోహిత్ రెడ్డి తో పాటు గువ్వల బాలరాజు, హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావులను ఒక్కొక్కరిని వందకోట్లకు కొనుగోలుచేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ స్థానిక పోలీసులు రైడ్ చేసి స్వామీజీలతో పాటు పలువురిని అరెస్ట్ చేశారు. దీనిపై కేసీఆర్ గంటల తరబడి ప్రెస్ మీట్లు పెట్టడంతో పాటు ఆ ఆడియోలు, వీడియోలు దేశంలోని జడ్జిలందరికీ పంపుతున్నట్లు చెప్పారు.

**ఐదు నెలలు హైడ్రామా**

2022లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశం సంచలనంగా మారింది. ఈ కేసులో బీజేపీ, అప్పటి అధికార బీఆర్ఎస్ మధ్య తీవ్ర రాజకీయ వైరం కొనసాగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు సంతోష్ కుట్ర చేశారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేసేందుకు కేసీఆర్ ప్రయత్నం కూడా చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో అరెస్టు అయిన నిందితులు, బీఎల్ సంతోష్‌తో మాట్లాడినట్లుగా కొన్ని సాక్ష్యాలను కేసీఆర్ మీడియా ముందు ప్రదర్శించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా బీఎల్ సంతోష్‌కు విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు సంతోష్ మిస్సింగ్ అంటూ హైదరాబాద్ లో పోస్టర్లు కూడా వేశారు. అయితే బీఎల్ సంతోష్ కోర్టును ఆశ్రయించి ఈ సమన్లపై స్టే తెచ్చుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం బీఎల్ సంతోష్‌ను అక్రమంగా ఇందులో ఇరికించిందని బీజేపీ నాయకులు ఆ సమయంలో ఆరోపించారు. పొలిటికల్ గా తనను ఇబ్బంది పెట్టిన కేసీఆర్ పై ఇప్పుడు బీఎల్ సంతోష్ రివేంజ్ స్టార్ట్ చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలను దాదాపు రెండుమాసాలు కేసీఆర్ తన వద్దే పెట్టుకున్నారు.

**ఆ ముగ్గురి పరిస్థితి ఏంటి?**

2022 అక్టోబరులో హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు (పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు, గువ్వల బాలరాజు, హర్షవర్ధన్ రెడ్డి) బీజేపీలో చేరేందుకు బేరసారాలు జరుపుతున్నారని ఆరోపణలు వచ్చాయి. బీజేపీకి చెందిన ముగ్గురు మధ్యవర్తులు (రామచంద్ర భారతి, నందకుమార్, సింహయాజి) ఎమ్మెల్యేలకు రూ.100 కోట్లు, వారికి సహాయం చేసినవారికి రూ.50 కోట్లు ఆఫర్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ బేరసారాలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీడియా ముందు ప్రదర్శించారు. ఈ కేసులో నిందితుల ఫోన్ సంభాషణల్లో బీజేపీ అగ్ర నేతలు బీఎల్ సంతోష్, తుషార్ వంటి వారి పేర్లు ప్రస్తావనకు వచ్చాయని బీఆర్ఎస్ ఆరోపించింది. ఇపుడు బాలరాజు చేరికతో కేసు విచారణ తిరిగి మొదలవుతుందన్న చర్చ సాగుతోంది.

# సోషల్ మీడియాలో రాహుల్ తుఫాన్

## 135 మిలియన్లకు పైగా వీక్షణలు

దేశవ్యాప్తంగా ఓట్ చోరీ ట్రెండింగ్
ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ వార్నింగ్..
5 ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్
బెంగళూరు ఫ్రీడం పార్క్ లో నిరసన సభ



**ఢిల్లీ, మహా:** రాహుల్ గాంధీ ఎన్నికలసంఘానికి ఆధారాలు చూపెడుతూ వేసిన ప్రశ్నలు భారత్ ట్రెండింగ్ గా మారాయి. సోషల్ మీడియాలో రాహుల్ ప్రసంగం.. ప్రజంటేషన్ తుఫాన్ లా మారింది. ట్విట్టర్ లో 20మిలియన్లు, ఇన్ స్టాగ్రామ్ లో 50 మిలియన్లు, ఫేస్ బుక్ లో 25 మిలియన్లు, యూట్యూబ్ లో 40 మిలియన్ల మందికి పైగా వీక్షించడంతో పాటు షేర్ల జోరుతో ట్రెండ్ క్రియేట్ చేశారు. రాహుల్ ప్రశ్నలకు సమాధానం చెప్పు ఈసీ అంటూ పలువురు నెటిజన్లు నిలదీశారు. తాము ప్రశ్నిస్తే ఓటరు లిస్టులే కనబడకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**ఈ ఐదింటికి సమాధానం చెప్పు**

బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి ఓట్ల చోరీకి పాల్పడ్డాయని ఆరోపించిన కాంగ్రెస్ అగ్రనేత, విపక్ష నేత రాహుల్ గాంధీ ఈసీకీ ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ ఎక్స్‌లో డిమాండ్ చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాస్తున్నారు?, సీసీటీవీ ఫుటేజీని ఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు ?, ఫేక్ ఓట్లను ఎందుకు అరికట్టలేకపోతున్నారు ?, విపక్షాలను చూసి ఎన్నికల సంఘం ఎందుకు భయపడుతోంది ?, ఈసీ బీజేపీ ఏజెంట్‌గా మారిందా ? అంటూ రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. వీటికి సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ రాహుల్‌గాంధీ శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో నిర్వహించిన నిరసన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఈసీని హెచ్చరించారు. '' ఇది కేవలం నా గొంతుక కాదు.. దేశ ప్రజలది. ఎన్నికల మోసం ఫిర్యాదుపై నా నుంచి ఈసీ అఫిడవిట్ కోరింది. రాజ్యాంగ మౌలిక సూత్రం ఒకే వ్యక్తి, ఒకే ఓటు. కానీ ఎన్నికల సంఘం అధికారులు దీనిపైనే దాడులు చేస్తున్నారు. పేదలపై దాడి చేస్తున్నారు. ఎన్నికల్లో మోసం చేసి ఈజీగా తప్పించుకుందా అనుకుంటే అది మీ పొరపాటు. ఆలస్యమైనా సరే మిమ్మల్ని వదలిపెట్టాం. ఒక్కొక్కరిగా పట్టుకుంటాం. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఒక్క మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ పైనే మేము ఫోకస్ పెట్టాం. ఇక్కడ ఈసీ, బీజేపీ కలిసి మోసానికి పాల్పడినట్లు ఆధారాలు లభించాయి. మహదేవపురంలో మొత్తం 6.5 లక్షల ఓటర్లు ఉండగా అందులో 1.25 లక్షల ఓట్లను చోరీ చేశారు. ప్రతి ఆరుగురిలో ఒక ఓటును తారుమారు చేశారు. 5 పద్ధతుల్లో ఈ మోసం జరిగింది. 12 వేల మంది ఫేక్ ఓటర్లు అయిదారు పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 40 వేల ఓట్లను ఫేక్ ఐడీలతో నమోదు చేశారు. ఒక ఇంటి అడ్రస్‌ను వందలాది ఓట్లపై నమోదు చేశారు. ఒక బీజేపీ నేత ఇంట్లో 40 మంది కుటుంబ సభ్యులు ఉన్నట్లు చూపించారు. ఆ ఇంటికి వెళ్లి చూడగా అక్కడ ఎవరూ లేరు. 4 వేల ఓటర్లకు అసలు ఫొటోలే లేవు. కొన్ని ఉన్నప్పటికీ అవి క్లారిటీగా లేవు. ఫారం 6 ద్వారా కొత్తగా 34 వేల మంది ఓటర్లను చేర్చారు. కానీ అందులో చాలావరకు 89 నుంచి 95 ఏళ్ల వారే ఉన్నారని'' రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం రాజ్యాంగం కోసం పనిచేయాలని బీజేపీ కోసం కాదంటూ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటర్ల లిస్టును, పోలింగ్ వీడియో రికార్డింగ్‌లను రిలీజ్ చేస్తే దేశవ్యాప్తంగా ఇలాంటి మోసం జరిగినట్లు నిరూపిస్తామని సవాలు చేశారు. దేశంలో విపక్ష పార్టీలన్నీ ఈ అంశంపై ప్రశ్నిస్తాయని.. ఈసీ తక్షణమే వాటికి సంబంధించిన డేటాను విడుదల చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు.

# భగ్గుమన్న బండి సంజయ్

## నాకే నోటీసులిస్తా అంటావా?

కేటీఆర్ కోతి చేష్టలకు లొంగే వ్యక్తిని కాదు
నీ చీకటి రహస్యాలు బయటపెడితే
దాక్కోవడానికి చోటుండదు
వావి వరుసలు లేకుండా ఫోన్లు ట్యాప్ చేశారు
ఈ కేసును సిబిఐకి అప్పగించాలి
సిట్ ఎదుట విచారణకు హాజరైన బండి
పెద్ద ఎత్తున తరలివచ్చిన కాషాయశ్రేణులు



**హైదరాబాద్, మహా :** 48గంటల్లో క్షమాపణ చెప్పాలంటూ కేటీఆర్ ఇచ్చిన వార్నింగ్ పై కేంద్రమంత్రి బండిసంజయ్ భగ్గుమన్నారు. 'అధికారం ఉందని చేయాల్సిన ఇల్లీగల్ పనులన్నీ చేశారు. తిరిగి నాకే లీగల్ నోటీసులు ఇస్తామని మాట్లాడటానికి కేటీఆర్‌కు సిగ్గుండాలి. లీగల్ నోటీసుల పేరుతో కేటీఆర్ దాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ ఇలాగే ప్రయత్నించి విఫలం అయ్యారు. కేటీఆర్ కోతి చేష్టలకు తాను లొంగే వ్యక్తిని కాదు. రాఖీకి ముందు చెల్లెలి నుంచి తప్పించుకోవడానికి కేటీఆర్ ఈ డ్రామాలన్నీ ఆడుతున్నారు. నాకు కేటీఆర్ గడువు ఇవ్వడం కాదు.. నీ చీకటి రహస్యాలు బయటపెడితే దాక్కోవడానికి చోటు కూడా మిగలదు' అని బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎక్స్ వేదికగా కేటీ ఆర్ కు కౌంటర్ ఇచ్చిన బండిసంజయ్ రాష్ట్రప్రభుత్వంపైనా ఫైర్ అయ్యారు.

**బండి విచారణ..**
**తరలివచ్చిన కాషాయశ్రేణులు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట కేంద్ర మంత్రి బండి సంజయ్ విచారణ ముగిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు విచారణ కొనసాగింది. ఈ క్రమంలోనే ఆయన కేసుకు సంబంధించి పలు కీలక ఆధారాల ఫైల్‌ను దర్యాప్తు అధికారులకు అందజేశారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్లు ట్యాప్ అయిన వారి జాబితాలో రేవంత్ రెడ్డితో పాటు హరీశ్ రావు పేర్లు కూడా ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో తన ఫోన్ ఎక్కువగా ట్యాప్ చేశారని ఆరోపించారు. సిట్ అధికారులు ట్యాపింగ్‌కు సంబంధించి చూపించిన వివరాలు చూసి తాను షాక్‌కు గురయ్యానని తెలిపారు. మావోయిస్టుల జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఫైర్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తాను.. అప్పట్లోనే చెప్పానని అన్నారు. వావి వరుసలు లేకుండా ఫోన్లు ట్యాప్ చేశారని మండిపడ్డారు. చివరికి తన ఇంట్లో సిబ్బంది ఫోన్లు కూడా ట్యాప్ చేయడం దారుణమని అన్నారు. కేసీఆర్ కూతురు కవిత ఫోన్లను కూడా విపరీతంగా ట్యాప్ చేశారని పేర్కొన్నారు. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నా చుట్టూ నిఘా పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో చివరికి సామాన్యుల కూడా ఫోన్లు మాట్లాడలేకపోయారని బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన రాధాకిషన్ రావు, ప్రభాకర్ రావుకు ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కానీ, రేవంత్ సర్కార్ నిందితులకు కాపాడే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేసును ఇంకా సాగదీస్తున్నారని బండి సంజయ్ మండిపడ్డారు. దీనిని వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

**మధును విచారించిన సిట్**

కేంద్రమంత్రి బండిసంజయ్ వ్యక్తిగత సిబ్బంది పసునూరు మధు, బోయినిపల్లి ప్రవీణ్ రావు, పోగుల తిరుపతిలను వేర్వేరుగా సిట్ పోలీసు అధికారులు విచారించారు. సుమారు 45నిమిషాల పాటు వీరిని సిట్ అధికారులు విచారించారు.


## 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకో..

- లేదంటే లీగల్ నోటీసులు పంపుతా
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మాజీ మంత్రి కేటీఆర్ వార్నింగ్

**హైదరాబాద్, మహా:** కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. ఇంటెలిజెన్స్ విభాగంపై ఆయనకు కనీస పరిజ్ఞానం లేదని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నప్పటికీ.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. ఇంటెలిజెన్స్ విభాగం ఎలా పని చేస్తుందో సంజయ్ అర్థం చేసుకోలేరని విమర్శించారు. నిర్లక్ష్యంతో ఆయన చేసిన ప్రకటనలు హద్దు మీరాయని, చౌకబారు ఆరోపణలతో ఆయన మరింత దిగజారారని విమర్శించారు. రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారు అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే నిరూపించాలని సంజయ్‌కు సవాల్ విసిరారు. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే లీగల్ నోటీసులు పంపుతానని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

# బండి సంజయ్ సిట్‌కు అందజేసిన ఆధారాలు ఇవే..

సిట్ విచారణకు హాజరైన కేంద్రమంత్రి బండి సంజయ్ అధికారులకు తన వద్ద ఉన్న కీలక ఆధారాలు అందజేశారు. అందులో 317 జీవో రద్దు కోసం ఉద్యమ కార్యచరణ లీకైందని సిట్ అధికారులకు తెలిపారు. ఆ క్రమంలోనే ముందుగానే బండి సంజయ్ అరెస్టుకు కరీంనగర్ పోలీసులు సిద్ధమయ్యారని తెలిపారు. ప్రజా సంగ్రామ యాత్రలో ఎక్కడెక్కడ ఎవరెవరిని కలవబోతున్నారు అన్న సమాచారం కూడా తెలుసుకున్నారని తెలిపారు. తద్వారా వారిన కలువనివ్వకుండా చేశారని సిట్‌కు ఆధారాలు సమర్పించారు. గ్రూప్1 అభ్యర్థుల పక్షాన పోరాడేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్న క్రమంలో ఫోన్ ట్యాప్ చేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల అనుమతుల కోసం హైకోర్టుకు వెళ్లిన సమయంలో జడ్జీల ఫోన్లు సైతం టైపింగ్ చేశారని విచారణ అధికారులకు బండి తెలిపారు. ఇక వివిధ కేసుల్లో తన బెయిల్ పిటిషన్ విచారించిన జడ్జిల ఫోన్లను సైతం టాప్ చేసినట్లుగా కేంద్రం సేకరించిన ఆధారాలను చూపించారు. వాటికి సంబంధించిన ఆధారాలు, హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలను సిట్‌కు అందజేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మాజీ పోలీస్ అధికారులు, ఐబీ అధికారుల నుంచి కీలక ఆధారాలు సేకరించి వారికి సమర్పించారు. కొన్ని ఆడియో రికార్డులను సైతం పెన్‌డ్రైవ్‌లో సిట్‌కు అందజేసినట్లుగా సమాచారం.



# పుతిన్‌కు ప్రధాని మోదీ ఫోన్

## మోదీకి చైనా వెల్ కం

## అమెరికాకు షాకులు

**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాలు మోపిన వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో, ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిణామాలపై ఇరువురు నాయకులు చర్చించారు. ఉక్రెయిన్‌తో యుద్ధంపై తాజా పరిణామాలను పుతిన్ వివరించగా, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ప్రధాని సూచించారు. భారత్ శాంతివైపు ఉందన్న వైఖరిని మోదీ పునరుద్ఘాటించారు. ఇదే సమయంలో రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రష్యా అధ్యకుడు పుతిన్‌తో ఫలప్రదమైన సంభాషణ జరిగిందని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్‌కు రానున్నారు. మరోవైపు ఈ నెల చివర్లో చైనాలోని తియాంజిన్ నగరంలో జరగనున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నడాన్ని చైనా స్వాగతిస్తున్నట్లు తెలిపింది. సదస్సులో భాగంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

# బీఆర్ఎస్ హయాంలో ప్రతి పథకంలో కమీషన్లే..

## పదేళ్ల పాటు ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు

బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫైర్
రూ. లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది
డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ఆశ చూపి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేశారంటూ వ్యాఖ్య
బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన మంత్రి



**హన్మకొండ, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా ఎంపిక చేసినట్లు చెప్పారు. హనుమకొండ బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు ఆరేళ్లకు పైగా డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ఆశ చూపి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ వసూళ్లతో దోచుకుందని ఆరోపించారు. రెండు ఎన్నికల్లో ఈ ఇండ్లను చూపించి గెలిచిన పార్టీ చివరకు ఎవరికీ ఇండ్లు ఇవ్వలేదన్నారు. మూడోసారి కూడా మోసం చేయడానికి ప్రయత్నిస్తే ప్రజలు తగు రీతిలో బుద్ధి చెప్పారని అన్నారు. పార్టీలకు అతీతంగా ఎంతో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు , కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు, రెండు మూడు ఇండ్లు ఉన్న వారికి ఇండ్లు మంజూరు చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్లను చూపి పేదల నుంచి బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా వసూలు చేశారన్నారు. ఈ ఇండ్ల ఆశను చూపి ప్రతీసారి ఎన్నికల్లో లబ్ధిపొందారని, అయితే మూడో సారి వారి మోసాన్ని గుర్తించిన పేదలు తగు బుద్ధి చెప్పారని తెలిపారు.

**ఈ ప్రభుత్వం పేదల పక్షపాతి..**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకే గాక పట్టణ పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. శ్రావణ మాస శుక్రవారం నాడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఇండ్లు మహిళల పేరిటే మంజూరు చేశామని, ఒక రోజు ముందుగాను 592 మంది అక్కా చెల్లెళ్లకు రాఖీ పౌర్ణమి కానుక అందించినట్లయిందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ ప్రభుత్వం పేదల పక్షపాతిగా సంక్షేమం అభివృద్ధితో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. తాజాగా ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే దశల వారీగా ఆరు హామీలను అమలు చేస్తున్న విషయం గమనించాలని మంత్రి కోరారు.

**కమీషన్ల కోసం కాళేశ్వరం..**

కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ కడితే ఏ విధంగా కూలిపోయిందో చూశారని తెలిపారు. తెలంగాణ ప్రజలకు వెన్నుపోటు పొడిచేలా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కమీషన్ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కక్కుర్తికి పాల్పడిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వారి అవినీతి వల్లే కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని తెలిపారు. వేల కోట్ల రూపాయిలు కేసీఆర్ కుటుంబానికి చేరాయన్నారు. దోచుకున్నది దాచుకోవడానికే బీఆర్ఎస్ నాయకులు తిరిగి అధికార ప్రభుత్వంపై దాడికి దిగుతున్నారని విమర్శించారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ ఆశయం మేరకు దేశంలో బీసీ కులగణన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. బీసీలకు 42 శాతం కోటా అమలు చేసి తీరుతామని మంత్రి తెలిపారు.



## ధర్మస్థలలో మరో కొత్త ప్రదేశంలో తవ్వకాలు

### మీడియాను నిరోధించలేమన్న సుప్రీం

**మహా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కర్ణాటకలోని ధర్మస్థల ఖననాల కేసులో మరో కీలక పరిణామం జరిగింది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో కొత్త ప్రదేశంలో తవ్వకాలను చేపట్టింది. గుర్తు తెలియని ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ ప్రదేశంలో తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఆప్రాంతంలో సిట్‌తో పాటు ఫోరెన్సిక్ నిపుణులు, సాంకేతిక సిబ్బంది కూడా ఉన్నారు. ఈ తవ్వకాలు కఠినమైన భద్రత మధ్య నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. అయితే ఆ స్థలం నుంచి కనుగొన్న వాటి గురించి ఇప్పటివరకు వెల్లడించలేదు. అన్ని ఆధారాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని అన్నారు. తదుపరి చర్యలు, ఫోరెన్సిక్ నివేదికలు చట్టపరమైన ప్రక్రియల ఆధారంగా ఉంటాయని తెలిపారు. అయితే, ఈ దర్యాప్తు ప్రజలు, రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చలకు దారి తీసిందని అధికారులు అన్నారు.

**సుప్రీం కోర్టు సంచలన నిర్ణయం**

మరోవైపు ధర్మస్థలలో సామూహిక అంత్యక్రియల కేసును నివేదించకుండా మీడియాను నిరోధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆలయాన్ని నిర్వహిస్తున్న కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మీడియా కథనాలు వస్తున్నాయని ధర్మస్థల ఆలయ కార్యదర్శి వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు పేర్కొంది. పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను తొలగించాలని కోరుతూ ధర్మస్థల ఆలయ కార్యదర్శి దాఖలు చేసిన పిటిషన్‌ను పునఃపరిశీలించాలని కర్ణాటకలోని ట్రయల్ కోర్టును ఆదేశించింది. చాలా అరుదైన కేసుల్లో మాత్రమే గ్యాగ్ ఆర్డర్లు జారీ చేస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. అన్ని విషయాలను ట్రయల్ కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్‌ను ఆదేశించింది.

## ఘోష్ కమిషన్ నివేదిక మాకు ఇవ్వండి

**సీఎస్ రామకృష్ణారావును కోరిన హరీశ్ రావు**



(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు శుక్రవారం సీఎస్‌తో సమావేశ మయ్యారు హరీశ్. స్వల్ప సమయం పాట మాత్రమే సీఎస్‌తో భేటీ అయిన హరీశ్.. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఏదైతే 665 పేజీల నివేదిక ఇచ్చిందో దాన్ని తమకు ఇవ్వాలని కోరారు.

**అసెంబ్లీలో పెట్టకముందే..**

కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.' ఊరు, పేరు మార్చి అంచనాలు మించి కట్టిన ప్రాజెక్టు కూలిందని, కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది. దీనిలో భాగంగా ఆ నివేదికను అసెంబ్లీలో పెట్టకముందే పరిశీలించాలనే యోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ముందుగా ఆ నివేదికను తీసుకుని అసలు కమిషన్ ఏం చెప్పింది అనే అంశాన్ని అధ్యయనం చేయాలని బీఆర్ఎస్ భావనగా ఉంది.

# బీజేపీలోకి ఐదుగురు ఎమ్మెల్యేలు

## త్వరలో పేర్లు, తేదీలు.. బీఆర్ఎస్ పనైపోయింది

### ఏఎన్ఎన్.. మహా తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు బాంబు పేల్చారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామని సదరు ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరే తేదీలు సైతం తెలియజేస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏఎన్ఎన్ తో రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేక తమ వైపు వారు చూస్తున్నారని పేర్కొన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలే కాదు, పలువురు నేతలు, మరికొంత మంది ఎమ్మెల్యేలు కూడా ఉన్నారన్నారు. ఆగస్ట్ 10వ తేదీన బీజేపీలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరనున్నారని తెలిపారు. బీజేపీలో చేరికలకు ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇలా పార్టీలో చేరే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు.

**సీబీఐకి అప్పగించాల్సిందే**

అత్యంత భయానకమైన కేసుగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు బయటకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు సీనియర్ అధికారులతో పాటు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఫోన్‌ను కూడా గతంలో ఉన్న ఎస్ఐబీ అధికారులు ట్యాప్ చేశారన్నారు. వీరందరినీ విచారించాలంటే సిట్ కు



అధికారం లేదని, దీనిపై గతంలోనే తాను హైకోర్టుకు కూడా వెళ్ళడం జరిగిందన్నారు. కేసు దర్యాప్తులో వేగం పెరగడంతో పాటు ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డ వారితో పాటు వారిని ఉసిగొల్పిన వారందరికీ శిక్ష పడాలంటే సీబీఐ దర్యాప్తే సరైందన్నారు. పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ అవినీతిపై దర్యాప్తు జరిపించడంతో పాటు ఖచ్చితంగా జైల్లో వేస్తామని ప్రజలకు చెప్పి ఇప్పుడు తానెందుకు అరెస్టు చేస్తానంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి రాగానే కమిషన్ లపై కమిషన్ లు, విచారణలంటూ హడావిడి చేసిన రేవంత్ ఇప్పుడు యూ టర్న్ తీసుకోవడం వెను ఉన్న మతలబు ఏమిటన్నది ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ కేసు నీరు గార్చారు, దన్వాడ ఫాం హౌజ్ పై చర్యలేమీ తీసుకోలేదు, విద్యుత్ ప్రాజెక్టులపై ఇలా అనేక విచారణలు ఇలా చెప్పుకుంటే పోతే అనేకం ఉన్నాయన్నారు. కేసీఆర్ తో కాంగ్రెస్ అధినాయకత్వం లోపాయికారిగా కుదుర్చుకున్న ఒప్పందమే కేసులను పక్కదారి పట్టించడానికి కారణమన్నారు.

**రేవంత్ కు ఓటమి భయం వెంటాడుతోంది**

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో వైఫల్యం చెందారని రాంచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఈ విషయాన్ని గ్రహించే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళడం లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడితే అధిష్ఠానం ముందు పరువు పోతుందనే ఎన్నికలను ఏదో ఒక సాకుతో వాయిదా వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అయన అసహానానికి పరాకాష్ట అని అన్నారు. 2014 నుంచి ఈసీ బీజేపీకి అనుకూలంగా పని చేస్తుందంటున్న రాహుల్ గాంధీ ఆ తర్వాత జరిగిన హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనుక రహస్యం ఏమిటో చెప్పాలన్నారు. 2014లో కంటే 2024లో కాంగ్రెస్ కు లోక్ సభ సీట్లు పెరగడం వెనుక ఉన్న రహస్యం ఏమిటన్నది ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీకి రాజకీయ నేతకు ఉండాల్సిన లక్షణాలే లేవన్నారు. రాహుల్ గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదన్నారు.

# కేసీఆర్ అవినీతి ప్రొఫెసర్

## రాష్ట్రాన్ని ఎంత దొరికితే అంత దోచుకున్నారు

- **నా ఆస్తి రూ. 1000 కోట్లు కొన్ని గంటల్లోనే ప్రజలకు పంచేస్తా**
- **కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడివైతే నా ప్రశ్నలకు సమాధానం చెప్ప**
- **నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటుంది**
- **కేసీఆర్, ప్రభాకర్ రెడ్డిపై నిప్పులు చేరిగిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని అన్నారు. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని, అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేత కేసీఆర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్‌రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు.

**ఆ టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్..**

కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్



రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు సైతం వస్తారని చెప్పారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మూసీ పునరుజ్జీవనమే సమస్యకు శాశ్వత పరిష్కారం

- ప్రతి వరద నీటి బొట్టు మూసీలోకి చేరేలా ప్రణాళిక రెడీ చేయండి
- భవిష్యత్ లో నగరంలో ఇలాంటి సమస్య పునరావృతం కావొద్దు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- నగరంలో వర్షాలతో తలెత్తే ఇబ్బందులు, సమస్య పరిష్కారంపై రివ్యూ

# వరద నీటి సమస్యకు చెక్!



**హైదరాబాద్, మహా:** ఓఆర్ఆర్ వరకు వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో వర్షాలతో తలెత్తే ఇబ్బందులకు, వరర సమస్య పరిష్కారంపై శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తీసుకున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి హైదరాబాద్ నగరం అతలాకుతలమైన పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండటమే నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందన్న అధికారులు స్పష్టం చేశారు. దీనిలో భాగంగా అధికారులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని వరద నీరు మూసీని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతీ చెరువు, నాలాలు, ఇతర కాలువలను మూసీకి అనుసంధానం చేయాలని అన్నారు. చెరువులను పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్ లో నగరంలో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనం అవసరమన్నారు. మూసీ పునరుజ్జీవనమే వరద సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టొచ్చని, ఆ దిశగా హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు.

# రఘునందన్‌రావుకు ఆగని బెదిరింపులు!

- **మేం హైదరాబాద్‌లోనే ఉన్నాం.. నిన్ను కచ్చితంగా లేపేస్తామని వార్నింగ్**
- **ఆరోసారి ఎంపీకి చంపుతామని బెదిరింపులు చేసిన వైనం**



**హైదరాబాద్, మహా:** మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి దుండగులు ఫోన్‌చేసి బెదిరించారు. హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రం లోగా చంపేస్తామని హెచ్చరించారు. ఆయనకు ఇలా బెదిరింపు ఫోన్ కాల్ రావడం ఆరోసారి. తాజాగా 9404348431 నెంబర్ నుంచి ఫోన్ వచ్చినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# కథాన్ ఖాన్ చెరువు కట్ట ఖతం

## నిజాం కాలం నాటి కట్టను తొలగించిన ఓ ప్రభుత్వ ఉద్యోగి..

గతంలో కాలువ కోసం స్థానిక ఎమ్మెల్యేని కలిసిన పోల్కంపల్లి గ్రామస్థులు

ఎమ్మెల్యే ఆదేశాలతో చెరువును పరిశీలించిన ఇరిగేషన్ డీఈ

చెరువు కట్టను తొలగించొద్దని ఆదేశించిన డిఈ చెన్నకేశవరెడ్డి

ఈ చేరువే మత్స్యకార రైతు కుటుంబాలకు ఆధారం

డి ఈ నిర్లక్ష్యం వల్లే నేడు కట్టను పూర్తిగా ధ్వంసం చేసిన వైనం..

యజమానిపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు.. ఇరిగేషన్ డిఈ...



**డీఈ చెన్నకేశవరెడ్డి వెనువెంటనే చర్యలు చేపట్టి ఉంటే...**

**పోల్కంపల్లిలోని చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉంటే 110 ముదిరాజ్ మత్స్యకారుల కుటుంబాలు, 60 రైతు కుటుంబాలు జీవిస్తాయని, ఈ చర్యలవల్ల అ కుటుంబాలకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత మార్చి నెలలో పరిశీలించిన ఇరిగేషన్ డిఈ చెన్నకేశవరెడ్డి, ఆ వెనువెంటనే చర్యలు చేపట్టినుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, సదరు అధికారిపై గ్రామ ప్రజలు మండిపడ్డారు. అధికారులు వెంటనే కథన్ చెరువు కట్టను పున: నిర్మించి, కాల్వకు మరమ్మత్తులు చేసి అభివృద్ధి చేయాలని, ముదిరాజు, మత్స్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా డిమాండ్ చేశారు.**

**రంగారెడ్డి జిల్లా మహా:** ఓ వైపు హైడ్రాతో కబ్జాలకు గురైన చెరువు, కుంటలను కబ్జాదారుల నుంచి విముక్తి కలిగిస్తుంటే మరో వైపు గ్రామాలలో చెరువులు, కాలువలు ధ్వంసం అవుతూనే ఉన్నాయి. ప్రభుత్వ అధికారే చెరువు కట్టను ధ్వంసం చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో నెలకొంది. ...పూర్తి వివరలలోకి వెళ్తే పోల్కంపల్లి నాగులమ్మ చెరువులు నుండి గొలుసు కట్టుగా కథాన్ ఖాన్ చెరువు ఉంది. అదే విధంగా ఇదే చెరువు నుండి బూర్ కుంటకు వెళ్లే కాలువ కూడా ఉంది. పోల్కంపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్ 85 లోగల భూమిని, సెక్రటేరియట్ లో పని చేసే ఓ ప్రభుత్వ ఉద్యోగి కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిందే అదునుగా కథాన్ చెరువు కట్టను తొలగించి, భూర్ కుంట కాలువ చుట్టూ గోడను నిర్మించుకోవడం జరిగింది. కథాన్ ఖాన్ చెరువు కట్టను తొలగించడంపై, స్థానిక రైతులు, పోల్కంపల్లి మత్స్య కారులు అడ్డుకున్నారు.

**స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన రైతులు...**

ఇదే విషయం పై స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి విషయాన్ని తెలియజేయడంతో వెంటనే స్పందించి ఎమ్మెల్యే చెరువు కట్ట, కాలువను ధ్వంసం చేయకుండా కాపాడాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలను జారి చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో, మార్చ్ 24న సంఘటన స్థలానికి పరిశీలించిన ఇరిగేషన్ డిఈ చెన్నకేశవరెడ్డి ప్రీ కాస్ట్ గోడను తొలగించాలని, మరియు చెరువు కట్టను తొలగించటానికి విలులేదని యజమానికి తెలియజేసినట్టుగా మీడియా ముఖంగా మత్స్య కారులకు, ప్రజలకు ఇరిగేషన్ డిఈ చెప్పారు.

**ఫిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్న చర్యలేవి..?**

ఇదిలావుండగా ఈ మధ్య కాలంలో మరల అధికారుల మాటలను సవాల్ చేస్తూ చెరువు కట్టను పూర్తిగా తొలగించి మాయం చేశారు. దింతో మత్స్యకారులు ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో, సదరు యజమానిపై ఇరిగేషన్ డిఈ చెన్నకేశవరెడ్డి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. పిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్నా యజమానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం పై స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇరిగేషన్ శాఖ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశామని చేతులు దులుపుకున్నారు.

**ఇరిగేషన్ అధికారుల వైఫల్యమే కారణమా..?**

ఇందులో వైఫల్యం ఇరిగేషన్ శాఖది కాదా..? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. డిఇ స్థాయి అధికారి వచ్చి పోల్కంపల్లిలోని చెరువు కట్టను, కాలువను పరిశీలించిన, ఇప్పుడు మాత్రం ఆ కట్ట లేదు.. కట్టను మాయం చేసిన వాళ్ళు భవిష్యత్తులో కాలువను కూడా మాయం చేస్తారు. ఏది ఏమైనా, ఎ శాఖది అలసత్వం అయినా, దీన్ని అడ్డుకునే వారు ఎవరు అని మత్స్య కారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తే ఎట్లా...?**

చట్టాలు తెలిసిన ప్రభుత్వ ఉద్యోగులు, నిబంధనలను మరచి, కబ్జాలకు పాల్పడుతూ, నిబంధనలను ఉల్లంఘించి చెరువులను కుంటలను ధ్వంసం చేయడంపై సామాన్యులు వాపోతున్నారు. ప్రభుత్వ అధికారులే ఇలాంటి అక్రమాలకు పాల్పడితే, ప్రైవేట్ వ్యక్తుల పరిస్థితి ఏంటి అని పలువురు మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై, ప్రభుత్వ ఉన్నతాధికారులు, హైడ్రా సంస్థ కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులు కుంటల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోల్కంపల్లి గ్రామ ప్రజలు కోరారు.

**బూర్ కుంట కాలువకు గండం...**

బూర్ కుంట కాలువకు అడ్డంగా ప్రీ కాస్ట్ గోడను నిర్మాణం చేసిన వారిపై చర్యలు లేకపోవడంతో ఈ భూమి అవతల మరియు ఇవతలి కాలువను ఎవరికీ ఇష్టం వచ్చినట్టు వాళ్ళు పూడ్చి వేయడం జరుగుతుంది. ఇది ఇలాగానే కొనసాగితే పోల్కంపల్లి గ్రామంలో చిన్న చిన్న కుంటలు కనుమరుగయ్యే అవకాశం ఉందని మత్స్య కారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరలక్ష్మీ వ్రతం.. ఫొటో కాంటెస్ట్



అప్పని నాగరాజు-సునీత- మంచిర్యాల




అరికె సుమ రవికుమార్- మంచిర్యాల



వరలక్ష్మి వ్రతం వనపర్తి జిల్లా



యశస్విని, ఏలూరు



రాకేష్, నారాయణపేట

# సీఎం రమేష్ అబద్ధాల కోరు

## కంచె గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్ ప్రభుత్వానికి లోన్ ఇప్పించారు

### బీజేపీ నేత సీఎం రమేష్ పై మన్నె గోవర్ధన్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** సారా వ్యాపారంతో బీజేపీ నేత సీఎం రమేష్ వందల కోట్లు సంపాదించారని బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంచార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఫోర్జరీతో ఆయన బ్యాంకులకు రూ. 450 కోట్లు ఎగ్గొట్టారని, ఆంధ్రా బ్యాంకుకు రూ. 70 కోట్లు ఎగ్గొట్టారని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని సీఎం రమేష్ అబద్ధాలు చెప్పారని స్పష్టం చేశారు. రమేష్ పైన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో మన్నె గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రమేష్ టీడీపీలో రాజ్యసభ సభ్యుడిగా ఉండి ఈడీ దాడులు జరిగితే భయపడి బీజేపీలో చేరారని అన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఎప్పుడో వచ్చిందని, ఈ విషయంలో కేటీఆర్ పై అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.

**తెలంగాణలో సింగిల్ డిజిట్ ఉన్న బీజేపీ..**

ఫోర్త్ సిటీలో రమేష్‌కు రేవంత్ రెడ్డి రూ.1600 కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపించారు. తెలంగాణలో సింగిల్ డిజిట్ ఉన్న బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాదని స్పష్టం చేశారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బ్రోకర్ గా సీఎం రమేష్ ఉన్నారని ఫైర్ అయ్యారు. పది సంవత్సరాల్లో తెలంగాణపై కన్నెత్తి చూడని వాళ్ళు ఇప్పుడు పెత్తనం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను 20 మంది సీమాంధ్ర పెట్టుబడుదారులు దోచుకుంటున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. సీఎం రమేష్ మరోసారి వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



మహా పత్రిక
తెలుగు
స్వయంకృషి
04






## నా లక్ష్యం అదే

**- మన అగ్రిటెక్ అధినేత రమేష్**

నేను మన అగ్రిటెక్ సంస్థను లాభాల కోసమో డబ్బుల కోసమో మొదలు పెట్టలేదు మా నాన్న ఒక రైతు ఆయన వ్యవసాయ క్షేత్రంలో చేసిన కష్టాన్ని దగ్గరుండి చూసిన వ్యక్తిని ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేస్తే అప్పులే మిగిలేవి ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయని నేను లండన్ లో ఉన్నప్పుడు అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన విధానాలు,పద్దతులు అవలంభించాలని గ్రహించి లండన్ లో ఉద్యోగంను వదిలి దేశానికి వచ్చి ఎందరో మేధావులు,రైతు ప్రేమికులు,అనుభవజ్ఞులైన నిపుణలతో సంప్రదించి వ్యవసాయంలో ఆధునీకరనే రైతులకు గొప్ప వరమని భావించి నా వంతుగా ఏం చేయాలని ఆలోచించి మన అగ్రిటెక్ సంస్థను స్థాపించడం జరిగింది. మన అగ్రిటెక్ లో విత్తు విత్తిన నాటి నుండి పంట చివరి దశ వరకు అన్ని రకాల ఆధునిక పరికరాలను రైతులకు సరసమైన ధరలకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా అందించడం జరుగుతుంది. మా సంస్థ ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి పరోక్షంగా 5వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం.

# ఆధునిక వ్యవసాయానికి సరికొత్త నిర్వచనం

# మన అగ్రిటెక్

## వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

### ఆధునిక పనిముట్లకు కేరాఫ్ మన అగ్రిటెక్

### ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగ ఉపాధి కల్పన

### మన అగ్రిటెక్ ఎండి పి రమేష్ స్ఫూర్తిదాయక ప్రస్థానం

**మహా స్పెషల్**

ఎంతో కష్టపడి పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగం చేసి కన్న తల్లితండ్రుల కలలు నెరవేర్చి జీవితంలో స్థిరపడేవారు కొందరైతే, వ్యాపారాలు పెట్టి కోట్లు ఆర్జించాలనుకునే వారు ఇంకొందరు. సేద్యాన్ని వదిలి ఉద్యోగాలకు వెళ్లే వారు మరి కొందరు. ఇలా డబ్బుకోసం నిరంతరం కృషి సాగుతుంది. వీటన్నింటికి భిన్నంగా ఓ వ్యక్తి తన లక్ష్యాన్ని ముందే సాధించాడు. లక్షల జీతాలు తీసుకున్నాడు.. లండన్ లో స్థిరపడి గొప్ప జీవితాన్ని అనుభవించాడు. అయినప్పటికీ అతనికి ఇవేవీ తృప్తినివ్వలేదు. ఉన్న ఊరు కన్నతల్లి లాంటిదని,పురిటిగడ్డను మరువక లండన్ లో పట్టిందల్లా బంగారమే అయినా సేద్యం పై మక్కువతో బంగారం లాంటి జీవితాన్ని వదులుకొని రైతులే తన సర్వస్వంగా భావించి వారు బాగుంటేనే రాష్ట్రంతో పాటు దేశం బాగుంటుందని పరాయి దేశాన్ని వదిలి స్వదేశం తిరిగొచ్చి మన అగ్రిటెక్ సంస్థను స్థాపించి రైతాంగానికి అవసరమైన అత్యాధునిక పనిముట్లను పరిచయం చేసి రైతులకు ఆధునిక వ్యవసాయంలో శిక్షణ అందిస్తూ తన లక్ష్యాన్ని సాధించారు. ఆయనే మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్.

### ఎవరీ పాషికంటి రమేష్?

పాషికంటి రమేష్ ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామమైన రాజేశ్వరరావు పల్లి గ్రామంలో పాషికంటి మల్లికాంబ సాంబయ్య దంపతుల కుమారుడు చిన్నతనం నుండే ఎన్నో కష్టాలను అనుభవించి ఎంతో కష్టపడి గొప్ప చదువులు చదివారు. రమేష్ కు చిన్నతనం నుండే వ్యవసాయం అంటే మక్కువ తన తండ్రి వ్యవసాయదారుడు తండ్రితో కలిసి వారి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లేవారు అలా వ్యవసాయం పై పూర్తి అవగాహన కలిగిన పాషికంటి రమేష్ క్రమక్రమంగా కష్టపడి మంచి ఉద్యోగం సాధించి లండన్ లో స్థిరపడ్డారు. కనీస రవాణా సౌకర్యం లేని మారుమూల గ్రామం నుండి అహోరాత్రులు కష్టపడి తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు ఇటు తండ్రికి వ్యవసాయ క్షేత్రంలో చేదోడువాదోడుగా ఉంటూ తన ఎంచుకున్న మార్గానికి తానే దిశానిర్దేశం చేసుకుంటూ తనదైన శైలిలో ముందడుగు వేస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు. రమేష్ విద్యాభ్యాసం నుండే చురుకైన వ్యక్తి ఒక విషయం తన దృష్టికి వచ్చిందంటే దాని పూర్వపరాలు లోతుగా అన్వేషించే వ్యక్తిత్వం అతనిది. ఆ వ్యక్తిత్వమే తనను రైతులకు మేలు చేయాలనే సంకల్పానికి నాంది పలికి తనను లండన్ కు చేర్చింది. లండన్ లో స్థిరపడినప్పటికి ఎదో తెలియని వెలితి మంచి ఉద్యోగం గొప్ప జీవితం కానీ వ్యవసాయం పురిటి గడ్డ పై మక్కువ, ఇవన్నీ వెరసి తనను లండల్ వదిలి స్వదేశం బాట పట్టేలా చేసింది.

### లండన్ వీడి ఆధునిక వ్యవసాయం వైపు

ఆనాటి వైయస్ రాజశేఖర్ రెడ్డి నుంచి ఈనాటి రేవంత్ రెడ్డి వరకు రైతే రాజవ్వాలి అని నినదించిన రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమే తన సంకల్పంగా మార్చుకొని ఎన్నో అవరోధాలను దాటుకుని రైతు ఉన్నతంగా బ్రతకాలి అప్పుల తిప్పలు ఇక ఉండకూడదని రైతుకు సాంకేతికతను జోడించి మరింత ముందుకు తీసుకుపోవాలని పరితపించే ఉన్నత విద్యావంతుడైన రమేష్ రైతుల కోసం ముందడుగు వేశాడు. ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి తానే ఒక వ్యవసాయదారుడి గా రైతుల కష్టాలు చూసి వ్యవసాయంలో లాభనష్టాలను బేరీజు వేసి ఏం చేస్తే రైతులకు అధిక వ్యయం తగ్గుతుందని రైతన్న లాభసాటి వ్యవసాయం చేయడానికి గల మార్గాలను అన్వేషించడం మొదలెట్టాడు. లాభసాటి వ్యవసాయం కోసం రైతుకు కావలిసిన మార్గాలను పూర్తిగా అధ్యయనం చేసి రైతులకు ఏదో విధంగా సేవ చేయాలని తిరిగి స్వదేశానికి తిరిగొచ్చి ఆధునిక వ్యవసాయ బాండగారమైన మన అగ్రిటెక్ సంస్థను ఆసియాలో రెండవ అతిపెద్ద మార్కెట్ అయినా ఎనమాముల మార్కెట్ లోని అపరాల యార్డ్ లో 2018 లో స్థాపించారు. పాషికంటి రమేష్ మన అగ్రిటెక్ సంస్థను స్థాపించడమే మొదలు ఆధునిక వ్యవసాయం పై రైతులకు పెద్ద సంఖ్యలో సమావేశాలు ఏర్పాటు చేసి ఆధునిక వ్యవసాయంలో మెళకువలు, రైతులకు కలిగే లాభనష్టాలు క్లుప్తంగా వివరించారు.

### మూస పద్దతులకు స్వస్తి

రైతులు మూస పద్దతులు అవలంభిస్తూ వ్యవసాయం చేయడం ద్వారా నష్టాలను చవిచూడడం జరుగుతుందని ఒకప్పటి వ్యవసాయ పద్దతులు నేటి ఆధునిక ప్రపంచంలో రైతులు వ్యవసాయ రంగంలో అవలభించాల్సిన తీరును రైతన్నలకు తెలియజేసారు. తను నాటిన విత్తనం మహావృక్షమై ఫలాలనిస్తే ఆ రైతుకు కలిగే ఆనందం వెలకట్టలేనిది. అలాంటి రైతు మోమున ఆనందాన్ని చూడాలని వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలనే దృఢ సంకల్పంతో ఏనమాముల మార్కెట్ లో ఆధునిక వ్యవసాయ పరికరాలతో కూడిన ఓ అధునాతన బాండగారాన్ని రైతుల కోసం రమేష్ ఏర్పాటు చేశారు. మన అగ్రిటెక్ లో వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి సృష్టించి,రైతన్నకు యాంత్రీకరణ అధునాతన పద్దతిలో వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల పనిముట్లను పరిచయం చేశారు. రైతన్న దుక్కి దున్నిన నాటి నుండి పంట అమ్ముకునేంత వరకు కావలిసిన ప్రతి ఒక్క పనిముట్టు మన అగ్రిటెక్ లో అందుబాటులో ఉంచారు. దుక్కి దున్నడానికి ట్రాక్టర్ వాటికి కావలిసిన కల్టివేటర్, రోటివేటర్,విత్తు విత్తడానికి సీడర్, మనుషులే విత్తగలిగే మ్యానువల్ సీడర్,ఎరువులు చల్లడానికి,కలుపు తీయడానికి వీడర్స్,చీడపీడలకు పిచికారి చేయడానికి బ్యాటరీ మరియు తైవాన్ స్ప్రేయర్స్ రైతన్నలకు ఇబ్బంది లేకుండా పోర్టబుల్ స్ప్రేయర్స్,ఆధునిక వ్యవసాయ రంగానికి అనుగుణంగా డ్రోన్స్,డ్రం సీడర్స్, మల్చింగ్ షీట్స్, పశువుల దాణా కోసం చాఫ్ కటర్స్ ఇలా చెప్పుకుంటూ పోతే మన అగ్రిటెక్ లో దొరకని వ్యవసాయ పనిముట్లు ఉండవని చెప్పడానికి అతిశయోక్తి లేదు. మన అగ్రిటెక్ ను అపరాల యార్డ్ లో వ్యవసాయ పనిముట్లను స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేసి ఒక్కో స్టాల్ లో ఒక వ్యవసాయ పనిముట్లు ఏర్పాటు చేసి దానిని ఎలా ఉపయోగించాలి,ఆ పనిముట్టు వల్ల లాభం ఇలా క్లుప్తంగా వివరిస్తూ అక్కడే ఏర్పాటు చేసిన టీవీలో ఆ పరికరం యొక్క పనితీరును చూపించి రైతులకు సులభంగా అర్థమయ్యేలా చేశాడు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత పెద్దమొత్తంలో పరికరాలను ఏర్పాటు చేసి 365రోజుల పాటు పరికరాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏకైక సంస్థ మన అగ్రిటెక్ మాత్రమే. మన అగ్రిటెక్ లో రైతన్న కొనుగోలు చేసిన ఏ పనిముట్టుకైనా 24/7 టెక్నీషియన్ సౌకర్యం కల్పిస్తూ రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ చొరవ తీసుకున్నారు. రైతులకందించే పనిముట్లలో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యమైన పరికరాలను మధ్యవర్తిత్వం, దళారి వ్యవస్థ లేకుండా రైతుకే నేరుగా పనిముట్లను అందించడంలో రమేష్ విజయం సాధించారు.

### మన అగ్రిటెక్ సేవలపై ప్రశంసలు

పాషికంటి రమేష్ నేతృత్వంలో మన అగ్రిటెక్ సంస్థ సేవలను రాష్ట్ర, జాతీయ ప్రముఖులు కూడా ప్రశంసించారు. ఎంతోమంది మంత్రులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు, రైతులు కొనియాడుతూ వారి మన్ననలను పొందుతూ మరింత గొప్పగా రైతులకు సేవలందించడానికి మన అగ్రిటెక్ సిద్ధమైంది. మన అగ్రిటెక్ అధినేత రమేష్ రైతుల కోసం చేస్తున్న సేవలను గుర్తించి ఎన్నో అవార్డులు, రివార్డులు ఆయన పంచన చేరాయి. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు సైతం అందుకున్నారు. రైతులకు ఇంత గొప్పగా సేవలందిస్తున్న మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ ఇంకా తృప్తి చెందలేదు. అంతేకాకుండా మన అగ్రిటెక్ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఆర్థిక సాయం, తనని సంప్రదించిన ఆశ్రమాలకు చేయూత నందించారు. వాటర్ ప్లాంట్స్, ఎండకాలం మజ్జిగ, మంచి నీటి వితరణ, అడిగిన వారికి లేదనకుండా తన వంతు బాధ్యతగా తన సహాయాన్ని అందిస్తునే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మన అగ్రిటెక్ సేవలను విస్తరించచడం జరిగింది. క్షేత్ర స్థాయిలో మరింత విస్తృతంగా సేవలందించడానికి యుద్ధప్రాతిపదికన గ్రామానికో వాలంటీర్ మండలానికో మన అగ్రిటెక్ స్టోర్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. అంతేకాకుండా మన అగ్రిటెక్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు మరింత సేవ చేయాలని ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అందరి సహకారంతో ఇదేవిధంగా భవిష్యత్తులో మన అగ్రిటెక్ ద్వారా రైతులకు, పౌండేషన్ ద్వారా ప్రజలకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటామని ఈ సందర్భంగా మన అగ్రిటెక్ అధినేత పాశికంటి రమేష్ తెలిపారు.

- శ్రీనాథ్, మహా, వరంగల్ జిల్లా ప్రతినిధి




### అందుబాటులో పనిముట్లు

రైతులకు కావలసిన ఎలాంటి వ్యవసాయ పనిముట్లయిన మన అగ్రిటెక్ లో అందుబాటులో ఉంటాయి అనే నానుడి రైతన్న మదిలో ఉందంటే మన అగ్రిటెక్ రైతన్న మనసులు ఎంతలా గెలుచుకుందో అర్థం చేసుకోవచ్చు. మన అగ్రిటెక్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడమే కాదు ప్రతి గ్రామానికి ఒక వాలంటీర్ ను ఏర్పాటు చేసుకొని రైతులకు సేవలందిస్తుంది. వాలంటీర్ల ద్వారా రైతుల అవసరాలకు అనుగుణంగా వారికి కావాల్సిన వ్యవసాయ పనిముట్లను నేరుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా రైతుల ఇంటి ముంగిటికి మన అగ్రిటెక్ సంస్థ చేరవేస్తుంది.

# అమృత్ 2.0 ద్వారా త్రాగునీటిని అందించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం



**మంచిర్యాల, మహా :** అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంకు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు త్రాగునీటిని అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్య లేకుండా అమృత్ 2.0 పథకం ద్వారా త్రాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని వెల్లడించారు. ఈ పథకం లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను నియంత్రించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల / కోటపల్లి, మహా :** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను నివారించాలని సంబంధిత అధికారులకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి తో కలిసి సందర్శించి మందుల నిల్వలు, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గురు కులాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరిసరాలు పర్యవేక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని వెల్లడించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఆ తర్వాత బొప్పారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధి పొందిన వారు ఇండ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని, నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉన్నారు.

# పలు దేవాలయాలలో వరలక్ష్మీ వ్రతం

## అమ్మ వారి దేవాలయాలలో మహిళా భక్తుల సందడి




**మందమర్రి, మహా :** మందమర్రి పట్టణం కే.కే. 1 సి.ఎస్.పి, శ్రీ. శ్రీ శ్రీ దుర్గా భవాని దేవాలయం, దొరగారి మామిడి తోటలోని శ్రీ అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయాలలో వరలక్ష్మీ వ్రతం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయాలకు మహిళలు కొత్త బట్టలు ధరించి పూజా సామాగ్రి, పిల్లాపాపలతో సతీ సమేతంగా సందడి చేశారు. ప్రతి సంవత్సరం శ్రావణం మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని చేయడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరని పెద్దలు అంటుంటారు. అంతేకాదు, సిరుల తల్లి లక్ష్మీదేవిని పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు లభిస్తాయని హిందువుల నమ్మకం. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు నర్సింగ్ భవాని, సతీష్ భవాని ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలోపేతమవుతందని అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికలకు దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని 26వ వార్డు బడ్కా మహల్లా ఖిలా లో స్థానిక శ్రేణులు ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆదిలాబాద్ కు మాజీ మంత్రి జోగురామన్న ప్రత్యేకంగా చేసిందేమీ లేదని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పాయల శంకర్ అభివృద్ధి అనే మాట మరిచిపోయారన్నారు. ఇద్దరికీ తమ సొంత ఎదుగుదల మీద ఉన్న శ్రద్ధ ఆదిలాబాద్ పై ఇక్కడి ప్రజలపై లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే పేద బడుగు బలహీన ఎస్సీ ఎస్టీ బీసీలగురించి ఆలోచించే పార్టీ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతందని పేదలకు మేలు చేసే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికలలో ఇంటింటికీ మన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రచారం చేసి ఓట్లు అభ్యర్ధించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్ , మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జహీర్ రంజానీ , షేక్ ముజాహిద్ , షౌకత్ అలీ, జీషన్ అలీ, ఇంతెఖాబ్ ఆలం ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.





# ప్రజాసేవాభవన్‌లో చేరికల సందడి

## ప్రభుత్వ పథకాలు చూసి ప్రజలు పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారు: కంది శ్రీనివాస రెడ్డి

### కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు.. కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

### పార్టీ బలోపేతంపై ఫోకస్.. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందడుగు.. కలిసికట్టుగా పనిచేద్దామని కంది శ్రీనివాస రెడ్డి పిలుపు



**ఆదిలాబాద్, మహా :** తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక మంచి సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న ప్రజోపయోగ పథకాలు చూసి ప్రజలు ఆకర్షితులై పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్ లో జరిగిన చేరికల కార్యక్రమంలో కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకురాలు జుబేదా ఆధ్వర్యంలో కేఆర్కే కాలనీ నుండి, కాప్రి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాప్రి నుండి, కూర మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కూర గ్రామంనుండి ప్రజలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తరలి వచ్చారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ గతంలోకంటే కూడా చాలా బలోపేతంగా తయారవుతుందన్నారు. ప్రభుత్వం పేదలకు మేలు చేసే పథకాలు అమలు చేస్తున్నందున ప్రజల్లో పార్టీ పట్ల ప్రభుత్వం పట్ల మంచి విశ్వాసం పెరిగిందన్నారు. మహిళలకుఉచిత బస్సు ప్రయాణం, 5వందలకే గ్యాస్ సిలిండర్, 2వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్ పథకాలు ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. అంతే కాకుండా ఉచిత సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ,యువతకు ఉద్యోగాలు, రుణమాఫీ, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు ప్రజలకు మంచి వరాలన్నారు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ఢిల్లీలో ప్రభుత్వ పెద్దలు పోరాటం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ,బీజేపీలు అధికారంలో ఉండి ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయని అన్నారు.పేదలకు ఉచిత బియ్యం అందించే రేషన్ కార్డులకోసం గరీబోళ్లు పదేళ్లుగా ఆశగా ఎదురుచూసారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు పత్రాలు పంపిణీచేస్తూ వారి ఆశలను నిజం చేసిందన్నారు. పేదల గురించి ఆలోచించేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. అందుకే పార్టీని మరింత బలోపేతం చేసేందకు ప్రజలు సహకరించాలన్నారు. రానున్న పరిషత్ , పంచాయతీ , మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసికట్టుగా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, గుడిపల్లి నగేష్ ,బండారి సతీష్, సంద నర్సింగ్, రాజు, మొహమ్మద్ రఫీక్,దొగ్గలి రాజేశ్వర్,బండి దేవిదాస్ చారి , తుమ్మ చాంద్ షావ్, రాంరెడ్డి,లత ,భావన సింగ్,సోనియా మంథని,జుబేదా, షబానా,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# 17 లక్షల విలువ గల సీయంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్:** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యపరీక్షలు చికిత్సలు ఆపరేషన్లు తదితర ఖర్చులలో వారికి ఎంతో కొంత ఆర్థిక భరోసా అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఉపకరిస్తుందని తెలిపారు. శుక్రవారం సీఎం సహాయ నిధినుండి నుండి వచ్చిన 28 చెక్కులను ఆయన లబ్దిదారులకు అందించారు. మొత్తం 17 లక్షల విలువ గల చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ ఎఫ్ కోసం ప్రజా సేవాభవన్ లో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసానని ఇక్కడి సిబ్బంది అవసరమైన బిల్లులు తీసుకొని దరఖాస్తులు నింపడం నుండి అవి హైదరాబాద్ సీయంఆర్ ఎఫ్ వరకు చేరే బాధ్యత తీసుకుంటారన్నారు. అక్కడ మరో ముగ్గురు ఫాలోఅప్ చేస్తూ చెక్కుల మంజూరులో కృషి చేస్తున్నారన్నారు. కష్టాలలో ఉన్న వారికి ఎంతో కొంత సహకారమందించేందుకు సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని తెలిపారు. ఆసుపత్రుల్లో డబ్బులు పెట్టి వైద్యం చేయించుకున్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, గుడిపల్లి నగేష్ , లోక ప్రవీణ్ రెడ్డి , బండారి సతీష్, సంద నర్సింగ్, రాజు, మొహమ్మద్ రఫీక్,దొగ్గలి రాజేశ్వర్,బండి దేవిదాస్ చారి , తుమ్మ చాంద్ షావ్, రాంరెడ్డి,లత ,భావన సింగ్,సోనియా మంథని,జుబేదా, షబానా,జ్యోతి పాల్గొన్నారు.

# మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న నిత్యాన్నదానం

## సందర్శించి స్వయంగా వడ్డన చేసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా సేవాభవన్ లో గత మూడున్నరేళ్ళుగా నిరంతరాయంగా కొన సాగుతున్న నిత్యాన్న దాన కేంద్రాన్ని కంది శ్రీనివాస రెడ్డి శుక్రవారం సందర్శించారు. కేంద్రానికి ఆకలి తీర్చుకోవడానికి వచ్చిన అందరికి నమస్కరిస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఎలా ఉన్నారంటూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. వచ్చిన వారికి ఆయన స్వయంగా వడ్డన చేస్తూ కడుపు నిండా భోజనం చేయాలని కోరారు. చిన్నారులకు తన చేత్తో కలిపి తినిపించారు. కంది శ్రీనివాస రెడ్డి చేస్తున్న నిత్యాన్న దానంతో పాటు సామాజిక సేవలను అందరు ప్రశంసించారు. పేదల ఆకలి తీర్చడం భగవంతుడు తనకు కల్పించిన అదృష్టమని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. తరుచుగా వచ్చేవారితో పాటు ఆదిలాబాద్ కు చుట్టుపక్కల గ్రామాల వారు ఏ పని మీద వచ్చినా మధ్యాహ్నం వేళ అన్నదాన కేంద్రంలో భోజనం చేయవచ్చని తెలిపారు. తాను గెలిచినా ఓడినా నిత్యాన్నదానం మాత్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గిమ్మ సంతోష్, గుడిపల్లి నగేష్ , లోక ప్రవీణ్ రెడ్డి , బండారి సతీష్, సంద నర్సింగ్, రాజు, మొహమ్మద్ రఫీక్,దొగ్గలి రాజేశ్వర్,బండి దేవిదాస్ చారి , తుమ్మ చాంద్ షావ్, రాంరెడ్డి,లత ,భావన సింగ్,సోనియా మంథని,జుబేదా, షబానా,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

## ప్రజాసేవాభవన్ కు తరలివచ్చిన జనం.. మంత్రులు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్న కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవ భవన్ లో నిర్వహించిన ప్రజా దర్బార్ కు నియోజకవర్గంలోని నలుమూలలనుండి ప్రజలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన వారందరితో ప్రజాసేవాభవన్ కిక్కిరిసిపోయింది. ప్రజలు తమ సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి కి వివరించి వినతి పత్రాలు అందించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని సానుకూలంగా స్పందించారు. పలు సమస్యలపై ప్రజలిచ్చిన దరఖాస్తులను మంత్రులు ప్రభుత్వ పెద్దల వద్దకు చేర్చి పరిష్కారం కోసం కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు.ప్రతీ వారం నిర్వహించే ప్రజాదర్బార్ లో ప్రజలు తమ సమస్యలు తెలియపరిచి సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ , నాగర్కార్ శంకర్, గుడిపెల్లి నగేష్ ,తాజామాజీ కౌన్సిలర్లు బండారి సతీష్, సందా నర్సింగ్, రాజు , రషీద్ ఉల్హాక్,అల్చేట్టి నాగన్న, లత ,భావన సింగ్,సోనియా మంథని,జుబేదా, షబానా,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# శ్రావణమాసం.. గృహమే ఓ దేవాలయం..

**కాటారం, మహా :** 12 మాసాల్లో శ్రావణమాసం ప్రత్యేకం. శ్రావణమాసంలో ఇళ్లే ఓ దేవాలయం గా మారింది.లక్ష్మీమాతకు పవిత్రమైన రోజుగా భావించి శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ను మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.తమ ఇంట అష్టైశ్వర్యాలు కలగాలని అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని లక్ష్మీదేవిని ఆరాధించారు.నానబెట్టిన శనిగలు, పెసర్లు అమ్మవారికి నైవేద్యంగా పసుపు కుంకుమతో పూజ చేశారు.ఇస్తినమ్మా.. తీసు కుంటినమ్మా వాయనం అంటూ మహిళలు ఇచ్చిపుచ్చుకున్నారు. కా టారంలోని అయ్యప్ప దేవాలయంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మిపూజలు నిర్వహించారు. ఒకరికొకరు పసుపు బొట్టు వాయనం ఇచ్చుకున్నారు. శ్రావణమాసం, వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు, కాళేశ్వరం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతమును ఆచరించినారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులందరికీ దేవస్థానం నుండి పసుపు, కుంకుమ, గాజులు, బ్లౌజ్ పీసులు,పూజా సామాగ్రి పంపిణీ చేశారు. పూజ అనంతరం అర్చక స్వాములు, వేద పండితులు భక్తులందరికీ ప్రత్యేక తీర్థ ప్రసాదములు ఇచ్చి ఆశీర్వచనం చేసినారు.

**భూపాలపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో...**

భూపాలపల్లి మంజూరునగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక శ్రీ వరలక్ష్మీ వ్రతం ను ఆలయ అర్చకులు హిమాన్స్ త్రివేది ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త గండ్ర వెంకట రమణా రెడ్డిజ్యోతి భక్త మహాజనులు పాల్గొన్నారు.రక్షాబంధన్ పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి కి భక్తులు రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.





## నాటు సారా పట్టివేత

**సిర్పూర్ మహా :** దహెగాం మండలం పీకలగుండం గ్రామ పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సందర్భంగా, కల్వడ గ్రామానికి చెందిన అజ్మీరా రాములు, పాల్వ్య సురేష్ ఆటోలో 20 లీటర్ల నాటు సారాయిని రవాణా చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి. రవి తెలిపారు. తనిఖీలో ఎస్సై పి. లోభానంద్, ఐ. సురేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా వరలక్ష్మి వ్రతం

**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెల్తరోడా స్కూల్ లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, ముందస్తు రాఖీ పండుగ వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులను ధరించి పూజల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతోపాటు ముందస్తు రాఖీ పండుగను జరుపుకున్నారు. మహిళలు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం యొక్క మహిమను, రాఖీ పండగ విశిష్టతను వివరించారు. రాఖీ పండుగ సోదర-సోదరీమణుల ప్రేమ, ఆప్యాయతలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ వేడుకల నిర్వహణలో సహకరించిన సిబ్బందికి విద్యార్థులకు యాజమాన్యం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



## అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు సత్యసాయి మందిరంలో మహిళలు ఘనంగానిర్వహించారు. మహిళలు వరలక్ష్మి అమ్మవారిని సుందరంగా అలంకరించి చేసి వ్రతాలు నిర్వహించారు. సుమారుగా 50 మంది వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవ సమితి కన్వీనర్ దొంతు శ్రీను, దొంతుపుల్లయ్య, దొంతు విశ్వనాథం, సంజీవ్ కుమార్, నాగిల్ల లింగం (చంటి),కృష్ణారెడ్డి, రాము గోల్డ్, ఎన్ ఆర్ ప్రభాకర్, గుర్రం సురేష్, మూర్తి గ్యాస్, అప్పం తిరుపతయ్య, బ్రహ్మం, పోలిశెట్టి శ్రీను, నాగిళ్ల శంకర్, పల్లె అల్లాజి గౌడ్, నారాయణ సాగర్, పాపిశెట్టి రాము, దొంతు సంధ్య, శైలజ, సైదులుగౌడ్, అలివేలు, అనిత, దొంతు విజయలక్ష్మి, దాస అరుణ, జ్యోతి, సింధు, దాస శ్రీను, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటడంతో సమాజానికి మేలు

### మాజీ మంత్రులు

**ఆమనగల్లు, మహా :** మొక్కలు నాటడంతో సమాజానికి మేలు జరుగుతుందని మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు.జిల్లా ఎస్టీ ఎస్సి మానిటరింగ్ సభ్యులు పత్య నాయక్ జన్మదిన వేడుకలు శనివారం అమనగల్లు పట్టణంలో అట్టహాసంగానిర్వహించారు.ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ నాయకులు,పత్య నాయక్ యువసేన,అభిమానులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మర్రి జనార్దన్ రెడ్డి,రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,మాజీ జడ్పిటిసిలు అనురాధ,దశరథ్ నాయక్,పార్టీ నేతలతో కలిసి పత్య నాయక్ కేక్ కట్చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం పత్య నాయక్ నుశాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం మొక్కలు నాటారు.కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మానవ సమాజానికి ఆధారమైన మొక్కల పెంపకంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలల్సిన బాధ్యతను ప్రతి పౌరుడుగుర్తుంచుకోవాలన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## కస్తూరిబా బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే

**భూపాలపల్లి , మహా :** భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట కస్తూరిబా బాలికల హాస్టల్ లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గంట సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో మాట్లాడుతూ స్కూల్ కాంపౌండ్ వాల్ కు ఫెన్సింగ్ సౌకర్యం, దోమల బెడద లేకుండా డోర్ల ఏర్పాటు, ఫ్యాన్ ల ఏర్పాటు, విద్యార్థులకు కడుక్కునేందుకు ప్రభుత్వం నుండే బెడ్ లు వచ్చేలా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. భోజనం, వసతి, విద్యా ప్రమాణాలు,బోధన గుణ నిల్వ వంటి అంశాలపై ప్రతి తరగతి గదులు,కిచెన్ రూమ్, డైనింగ్ రూమ్స్ తిరుగుతు విద్యార్థులను,ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని అన్నారు.విద్యార్థుల మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచామని అన్నారు.గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో విద్య వ్యవస్థ ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని,విద్యార్థులను పట్టించుకున్న పాపాన పోలేదు అని,పాఠశాలలో మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు.పాఠశాలలో కొరతలున్న వసతులు,మౌలిక సదుపాయాలపై స్పందించిన ఆయన, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి అని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి పాఠశాలల పరిరక్షణపై మరింత శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం హాస్టల్ విద్యార్థినులు ఎమ్మెల్యే కు రాఖీ కట్టారు.ఎమ్మెల్యే విద్యార్థులందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారి వెంట హాస్టల్ ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.



## జిల్లాలో ఫ్రైడే విత్ ఫుడ్ చిల్డ్రన్ నూతన కార్యక్రమం శ్రీకారం

జిల్లా వ్యాప్తంగా మండల ప్రత్యేక అధికారుల తనిఖీలు విద్యార్థులతో భోజనాలు

కొత్తగా ఆలోచించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**భూపాలపల్లి, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేపట్టిన "Friday Food with Children" కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రతి శుక్రవారం ప్రత్యేక అధికారులు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్నారు. భోజన పదార్థాల నాణ్యత, రుచి, మెనూ ప్రకారం వంటవిధానం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. విద్యార్థుల నుండి భోజనంపై అభిప్రాయాలు సేకరించి, తక్షణ సవరణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచిస్తున్నారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే వసతి గృహాల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



## బీజేపీకి పట్నంలో నిరసన సెగలు...

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్

**రంగారెడ్డి జిల్లా మహా:** బీహార్ లో ఓట్ల తొలగింపు ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ, ఇబ్రహీంపట్నంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి సిహెచ్ ఎల్లేష్ ఆధ్వర్యంలో బస్ స్టాప్ ముందు సాగర్ హైవేపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, బి సామెల్ మాట్లాడుతూ... బీహార్ లో ఓట్ల తొలగింపు ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీహార్ లో ఓడిపోతామనే భయంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ముస్లిం, క్రిస్టియన్లను పాక్, బంగ్లాదేశీయులుగా పేర్కొంటూ ఓట్లను తొలగించడానికి విమర్శించారు. 60 లక్షల ఓట్లు తొలగిస్తే తాము పోటీ చేసి ఏం లాభమని, పోటీ చేయడం లేదని, ఎలక్షన్లను బైకాట్ చేస్తున్నట్లు తేజస్వి యాదవ్ ప్రకటించారని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టారని, దీన్ని సీపీఐ(ఎం) పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇండియా, బ్రిటిష్ వ్యాపార ఒప్పందం, జీరో టారిఫ్ మన దేశ ఉత్పత్తిదారులను తీవ్రంగా నష్టపరుస్తుందని ఆయన అన్నారు. అక్కడ సబ్సిడీపై వస్తువులను తయారు చేసి తక్కువ ధరకు భారత్ లో "విక్రయిస్తారని, స్థానికంగా తయారు చేసిన వస్తువులకు గిట్టుబాటు ధర లభించదని, ఉత్పత్తిదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అణిచివేత ధోరణిని అవలంబిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను ఇప్పుడిప్పుడే ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, దానికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం అవుతున్నారని తెలిపారు.



## బీసీలు ఏకం కావాలి

బీసీల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం

మంత్రి పొన్నం ప్రభాకర్

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బీసీ సెల్ కార్యలయం, వ్యవసాయ కళాశాల అనుబంధ సెమినార్ హాల్ ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా యూనివర్సిటీ లో బీసీ విభాగం లేదున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బీసీ విభాగం ఏర్పాటు చేసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగస్తులు, విద్యార్థులు కలిసే అందరం బీసీ విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నా. బలహీన వర్గాల ప్రతినిధ్యానికి జరుగుతున్న పోరాటంలో రాజకీయ పార్టీలు మాత్రమే పాల్గొంటున్నాయి. కుల గణన జరిగిన తరువాత బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు విద్యా ,ఉద్యోగ ,స్థానిక సంస్థలు రిజర్వేషన్లు సాధించుకోవడానికి తెలంగాణ ఉద్యమం మాదిరి అన్ని వర్గాలు భాగస్వామ్యం కావాలి. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్,విసి అల్దాస్ జానయ్య, బీసీ సెల్ ఇంచార్జి డా, దామోదర్ రాజు, ప్రొఫెసర్లు, బీసీ సంఘాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గృహాల్లో మొక్కలు నాటేలా ఆర్ పి లు శ్రద్ధ తీసుకోవాలి

నగర మేయర్ గుండు సుధారాణి

కమిషనర్ తో కలిసి ఆర్ పి లకు మొక్కలు అందజేసిన చేసిన మేయర్

**వరంగల్ మహా;** గృహాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ఆర్ పి (రిసోర్స్ పర్సన్ )లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్ లో మెప్మా కు చెందిన ఆర్ పి లకు మొక్కల అందజేత కార్యక్రమానికి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటేలా ప్రతి గృహానికి బల్దియా నుండి మొక్కలను అందజేయడం జరుగుతుందని, సోమవారం నుండి ప్రతి వార్డులో కార్యక్రమాలు ఏర్పాటు చేసి మొక్కలను అందజేయాలని, ప్రతి ఇంటికి మొక్కలను అందజేసే కార్యక్రమంలో ఆర్పీలది ప్రత్యేక బాధ్యత అని, సానిటేషన్ హార్టికల్చర్ విభాగాల సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ స్థానిక కార్పొరేటర్ సహకారంతో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా , సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఏం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి, టి ఎం సి రమేష్, సి ఓ లు, తదితరులు, పాల్గొన్నారు.




## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాకేశ్ రెడ్డి



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కు చెందిన వల్లెపు సురేష్ మామ సూర ఎల్లయ్య ఇటీవల మరణించగా శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాకేష్ రెడ్డి శుక్రవారం ఎన్టీఆర్ నగర్ చేరుకొని ఎల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, అధైర్య పడవద్దని తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేతిరి రాజశేఖర్, పత్రి రాజ పోశాలు, మాజీ సర్పంచ్ భూక్య శంకర్, గంధం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణదారులపై కేసు నమోదు

**కాటారం, మహా :** కాటారం మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల పోతుల వాయి శివారులో గల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించడానికి ప్రయత్నం చేసిన చీటి దేవేందర్,సిద్ధం రాజబాబు పై కేసు నమోదు చేశారని బాధితులు సిద్ధం చంద్రయ్య,సిద్ధం సాయికుమార్ తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం పోతులవాయి శివారులో ఉన్న రెండు ఎకరాల వారసత్వ భూమిని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉన్న క్రమంలో దైవ దర్శనాల నిమిత్తం తిరుపతికి వెళ్లగా ఇదే అదునుగా భావించిన చీటి దేవేందర్, సిద్ధం రాజబాబు అనే ఇద్దరు వ్యక్తులు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేసినట్లు తెలిపారు. మేము తిరుపతి నుంచి వచ్చాక జరిగిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సదరు వ్యక్తులపై రెండు వేరువేరు కేసులు ఎస్ఐ నమోదు చేశారని బాధితులు తెలిపారు.

## భూ నిర్వాసిత రైతులకు అవార్డులు

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన శుక్రవారం 163 గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూమి కోల్పోయిన సంగెం మండలం తిమ్మాపూర్ గ్రామ భూ నిర్వాసిత రైతులకు అవార్డ్ పాస్ చేసేందుకు ఆర్బిట్రేషన్ నిర్వహించడమైనది. ఈ ఆర్బిట్రేషన్లో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసిల్దార్లు రాజ్ కుమార్, నేషన్ హైవే సైట్ ఇంజినీర్ ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.




## స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు చేయాలి :జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వేడుకలకు వచ్చే అతిథులు కోర్చోడానికి వీలుగా షామియాన, కుర్చీలు, బారికేడింగ్, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పాఠశాలల విద్యార్థులచే దేశ భక్తికి సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శాఖల వారిగా స్టాల్స్ ఏర్పాటు చేయుటకు డిఆర్డీఓ కు ఈ నెల 11వ తేదీ వరకు జాబితా ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా మినిట్ టు మినిట్ షెడ్యూల్ తయారు చేయాలని తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ఆమనగల్లు, మహా:** పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని అమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వందరోజుల ప్రణాళిక అమలులో భాగంగా పట్టణంలో వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలను పంపిణీ చేసి అనంతరం శంకర్ నాయక్ మాట్లాడారు.నాటి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్, పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి అంశాలపై దృష్టి సారించారు. పర్యటనలో భాగంగా, కొన్ని వార్డులలో అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. మరికొన్ని వార్డులలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మురికి నీరు అధికంగా వచ్చి దోమలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది షర్ఫొద్దీన్ ఉన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

### కలెక్టర్ నారాయణ రెడ్డి

**రాజేంద్రనగర్, మహా ;** భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండేందుకు సంబంధిత అధికారులు వారి బృందాలతో సిద్ధంగా ఉన్నారని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ మండలంలోని హిమాయత్ సాగర్ చెరువు నాలుగు గేట్లను ఎత్తిన సందర్భంగా శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా సందర్శించి గేట్లను, చెరువులోని నీటి సామర్థ్యాని పరిశీలించారు. నాలుగు గేట్లను వదిలి దిగువకు వదిలిన నీటిని పరివాహక ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వాస్తవ పరిస్థితిలను ఎప్పటికప్పుడు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన అన్నారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సామాజిక మాధ్యమాలలో అవగాహన కల్పించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షితంగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు, అక్కడ అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## నీట మునిగిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా ;** నిన్న కురిసిన భారీ వర్షానికి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలు,రోడ్లు నీటిలో మునిగిపోయాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం పలు కాలనీలలో పర్యటించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి కూలి పోయిన ఇంటిని,నీట మునిగిన ఇళ్లను,రోడ్ల పై నీరు నిలిచిన ప్రాంతలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. పలు చోట్ల బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఇళ్లలోకి వరద నీరు వచ్చి సర్వం కోల్పోయారని,ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో వర్ష బాధితులకు 10 వేలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు.బాధితులకు అండగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిలబడతారు. ప్రభుత్వం సహాయక చర్యల్లో విఫలం అయిందని విమర్శించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మణరావు, రాజేష్ కుమార్, సీతారాం దూళిపాళ, మాజీ కౌన్సిలర్ పద్మారావు, ధనరాజ్, ఉపేంద్ర నాథ్ రెడ్డి, మహమ్మద్ అరీఫ్, కిరణ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఈసారి మేడ్ ఇన్ ఇండియా రాఖీలదే హవా..

# ఏకంగా రూ.17000 కోట్ల బిజినెస్

రాఖీ (రక్షాబంధన్) పండుగ వస్తుందంటే.. మార్కెట్లు కోలాహలంగా మారిపోతాయి. తోబుట్టువులు రాఖీలు కొనుగోలు చేస్తే.. వారి కోసం అన్నదమ్ములు గిఫ్ట్స్ కొనేస్తుంటారు. ఈ సంవత్సరం రాఖీ సందర్భంగా దేశవ్యాప్తంగా రూ. 17,000 కోట్ల కంటే ఎక్కువ వ్యాపారం జరుగుతుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (CAIT) తెలిపింది. ''ఈ సంవత్సరం మార్కెట్లలో చైనీస్ రాఖీలు, వస్తువులు కనిపించడం లేదు" అని CAIT సెక్రటరీ జనరల్ & చాందినీ చౌక్ ఎంపీ 'ప్రవీణ్ ఖండేల్వాల్' పేర్కొన్నారు. వినియోగదారులు కూడా చాలావరకు మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను ఎంచుకుంటున్నారని అన్నారు. రక్షా బంధన్ కేవలం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు మాత్రమే కాదు, జాతీయవాదానికి కూడా ప్రతీకగా నిలిచింది. ఈ కారణంగానే ఈ సీజన్‌లో మోదీ రాఖీ, ఆపరేషన్ సిందూర్ రాఖీ, ఆత్మనిర్భర్ భారత్ రాఖీలు, డిజిటల్ రాఖీలు కనిపిస్తున్నాయి. విత్తనాలు, ఖాదీ, వెదురు, పత్తితో తయారు చేసిన పర్యావరణ అనుకూల రాఖీలకు అధిక డిమాండ్ ఉంది. వీటిలో చాలా వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వ్యవస్థాపకులు, చేతివృత్తులవారు, స్వయం సహాయక బృందాలు చేతితో తయారు చేసినవే ఉన్నాయి. రాఖీలు మాత్రమే కాకుండా.. స్వీట్లు, డ్రై ఫ్రూట్స్, గిఫ్ట్ హ్యాంపర్లు, అలంకరణ వస్తువులు వంటి వస్తువుల ద్వారా ఏకంగా రూ.4,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని కైట్ అంచనా వేసింది. ఢిల్లీ, జైపూర్, ముంబై, లక్నో అంతటా ఎక్కువగా దేశభక్తి ఇతివృత్తాలతో కూడిన రాఖీల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. రక్షాబంధన్ భారతదేశంలో అత్యంత బలమైన పండుగ సీజన్లలో ఒకటిగా ఉంటుందని వ్యాపారులు ఆశాభావంతో ఉన్నారు.

# దేశీయ స్టాక్ మార్కెట్లు పతనం

టారిఫ్ ప్రతిష్టంభన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ తో వాణిజ్య చర్చలను తోసిపుచ్చడంతో భారత బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 765.47 పాయింట్లు (0.95 శాతం) క్షీణించి 79,857.79 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 232.85 పాయింట్లు లేదా 0.95 శాతం తగ్గి 24,363.30 వద్ద ముగిసింది. ఈ క్రమంలో ఈ వారం సెన్సెక్స్ 742 పాయింట్లు, నిఫ్టీ 202 పాయింట్లు నష్టపోయాయి. బీఎస్ఈలో ఎన్టీపీసీ, టైటాన్, ట్రెంట్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో ఎన్టీపీసీ, టైటాన్, డాక్టర్ రెడ్డీస్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, ఇండస్ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ ఎంటర్ప్రైజెస్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి. విస్తృత సూచీలు కూడా పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 1.64 శాతం నష్టపోగా, స్మాల్ క్యాప్ 1.49 శాతం నష్టపోయింది. అన్ని రంగాలు నెగిటివ్ జోన్‌లో ముగిశాయి. నిఫ్టీ రియల్టీ 2.11 శాతం, నిఫ్టీ మెటల్ 1.76 శాతం, ఆటో 1.40 శాతం, ఫార్మా 1.30 శాతం నష్టపోయాయి.






# ఈఎంఐలు ఇక కాస్తయినా తగ్గుతాయ్..

లక్షలాది లోన్ కస్టమర్లకు ఊరట కల్పిస్తూ.. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంపీఎల్‌ఆర్) ను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 7 నుండి అమల్లోకి వచ్చిన ఈ తగ్గింపు గృహ రుణాలు, కారు లోన్లు, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐలను తగ్గిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండేళ్ల కాలపరిమితి మినహా మిగతా అన్ని కాలపరిమితులలో ఎంసీఎల్‌ఆర్‌ను 0.05 శాతం తగ్గించింది. ఓవర్‌నైట్, ఒక నెల ఎంసీఎల్‌ఆర్ 8.60 శాతం నుంచి 8.55 శాతానికి, మూడు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతం నుంచి 8.60 శాతానికి తగ్గింది. ఇక ఆరు నెలలు, ఏడాది కాలపరిమితి ఎంసీఎల్‌ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.70 శాతానికి తగ్గించింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.80 శాతం నుంచి 8.75 శాతానికి తగ్గింది.

**ఈఎంఐలు ఎలా ప్రభావితం అవుతాయంటే..**

ముఖ్యంగా ఫ్లోటింగ్ వడ్డీ రేట్లను ఎంచుకున్న రుణగ్రహీతలకు ఎంసీఎల్‌ఆర్ రేట్ల ద్వారా రుణ ఈఎంఐలు నేరుగా ప్రభావితమవుతాయి. ఎంసీఎల్‌ఆర్ తగ్గడం అంటే సాధారణంగా రుణాలపై వడ్డీ రేట్లు తగ్గినట్లే. ఇది ఈఎంఐలు తగ్గడానికి దారితీస్తుంది. తాజా మార్పుతో, ప్రస్తుత రుణగ్రహీతలు వారి రుణాల రీసెట్ కాలాన్ని బట్టి వారి నెలవారీ ఈఎంఐలలో స్వల్ప క్షీణతను చూడవచ్చు.

# విదేశాల నుంచి భారత్‌కు డబ్బు

## రెమిట్ ఫస్ట్ టు ఇండియా

ప్రవాస భారతీయులు విదేశాల నుంచి భారత్‌కు సులభంగా డబ్బులు పంపుకునేందుకు వీలుగా 'రెమిట్ ఫస్ట్ టు ఇండియా' ప్లాట్‌ఫామ్‌ను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రవేశపెట్టింది. ఎలాంటి ఖర్చు లేకుండా, ట్రాన్స్‌ఫర్ ఫీజు లేకుండా డబ్బులు పంపుకోవచ్చని ప్రకటించింది. సింగపూర్‌కు చెందిన ప్రముఖ రిమిటెన్స్ సేవల సంస్థ సింగ్ ఎక్స్ భాగస్వామ్యంతో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించడం గమనార్హం. ప్రస్తుతం సింగపూర్, హాంకాంగ్ నుంచి డబ్బులు పంపుకునే (రెమిటెన్స్) సేవలు అందుబాటులో ఉండగా, త్వరలో మరిన్ని దేశాలకు విస్తరించనున్నట్టు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది.

# ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లును వెనక్కితీసుకున్న కేంద్రం




కేంద్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు 2025ను వెనక్కి తీసుకుంది. ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం 1961లో మార్పులు చేస్తూ ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్రం ఫిబ్రవరి 13న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ నూతన ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు 2025ను తాజాగా ఉపసంహరించుకుంది. బైజయంత్ పాండా నేతృత్వంలోని సెలెక్ట్ కమిటీ చేసిన అనేక సిఫార్సులను చేర్చి నూతన ఆదాయపు పన్ను బిల్లు సరికొత్త వెర్షన్ ఆగస్టు 11న అంటే సోమవారం తిరిగి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బిల్లులో కొత్త మార్పులు చేస్తున్న క్రమంలో బహుళ వెర్షన్ల గందరగోళాన్ని నివారించడానికి అన్ని మార్పులతో స్పష్టమైన, నవీకరించిన ఆదాయపు పన్ను బిల్లును ఆగస్టు 11న సభ పరిశీలన కోసం ప్రవేశపెట్టనున్నారు.

**ఆదాయపు పన్ను బిల్లు 2025 మార్పులు**

గత ఫిబ్రవరిలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లు 2025 అరవై సంవత్సరాల నాటి భారతదేశ ప్రత్యక్ష పన్ను చట్టంలో పలు కీలక మార్పులు తీసుకొస్తోంది. 298సెక్షన్ ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో ప్రస్తుత శాసనం కంటే 50 శాతం తక్కువ సరళమైన భాషలో రాసిన ఆధునిక, పన్ను చెల్లింపుదారులకు స్నేహపూర్వక చట్టాన్ని తీసుకురావడం ఆదాయపు పన్ను బిల్లు 2025 ముఖ్యమైన లక్ష్యం.



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL




# అమెరికా సుంకాలకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్!



అమెరికా భారీ సుంకాలపై భారత్ గట్టి కౌంటర్‌కు సిద్ధమైంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన అమెరికా పర్యటన రద్దు చేసుకున్నారు. అగ్రరాజ్యం నుంచి కొత్త ఆయుధాలను, వైమానిక విమానాలను కొనుగోలు చేయకూడదన్న నిర్ణయంలో భాగంగానే ఈ పర్యటన రద్దు అయినట్లు సమాచారం. డొనాల్డ్ ట్రంప్ రెండో దఫా పాలనలో అమెరికా, భారత్ మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయి. అందుకు ట్రంప్ భారత్‌పై విధించిన భారీ సుంకాలే కారణం. భారత్ మిత్రదేశమే అయినా అమెరికాతో వాణిజ్యం అనుకున్నంత సంతృప్తిగా జరగడం లేదని.. పైగా రష్యాతో చమురు కొనుగోళ్లు జరుపుతోందంటూ ట్రంప్ గతంలో 25 శాతం టారిఫ్ విధించారు. ఆపై అగస్టు 6వ తేదీన.. తాను చెప్పినా వినలేదంటూ మరో 25 శాతం సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికాతో వాణిజ్యం జరిపే దేశాల్లో భారత్‌పై విధించిన సుంకమే హయ్యెస్ట్. దీంతో.. ట్రంప్ నిర్ణయాన్ని భారత్ అన్యాయంగా పేర్కొంది. అమెరికా, ఐరోపా దేశాలు తమ దేశాలకు అనుగుణంగా రష్యాతో వాణిజ్యం చేస్తుండడాన్ని ప్రముఖంగా లేవనెత్తింది కూడా. ఈ క్రమంలో ట్రంప్ టారిఫ్ వార్‌పై తీవ్రంగా స్పందించేందుకు ఇప్పుడు సిద్ధమైంది. రష్యాతో చమురు ఒప్పందాలు ఆగేది లేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. అదే సమయంలో.. రాజీ పడేది లేదని, సుంకాలతో భారీ మూల్యం చెల్లించేందుకైనా సిద్ధమని భారత ప్రధాని మోదీ ప్రకటించారు. అమెరికా సుంకాలపై అటు రష్యా, ఇటు అనూహ్యంగా చైనా భారత్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ క్రమంలో.. భారత ప్రధాని మోదీ త్వరలో చైనాలో పర్యటిస్తుండగా, రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటనకు వస్తుండడం ఆసక్తికర చర్చకు దారి తీసింది.

ఈ నెల చివర్లో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాలో ఐదురోజులపాటు పర్యటించాల్సి ఉంది. ఈ పర్యటనలోనే అగ్రరాజ్యంతో భారత్ భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంది. అయితే ఈ పర్యటన రద్దు అయినట్లు రాయిటర్స్ ఓ కథనం ప్రచురించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మోదీట్రంప్ సమావేశంలో పలు ఒప్పందాలు ప్రకటించారు. బోయింగ్ P8I విమానాలు, Stryker యుద్ధ వాహనాలు, Javelin యాంటీట్యాంక్ మిసైళ్లు కొనుగోలు చర్చలు దాదాపు ఓ కొలిక్కి వచ్చాయి. సుమారు 3.6 బిలియన్ డాలర్ల( రూ.31 వేల కోట్లు) విలువైన ఆ రక్షణ ఒప్పందాలు రాజ్‌నాథ్ అమెరికా పర్యటనలో కుదరాల్సి ఉంది. అయితే. ట్రంప్ టారిఫ్ వడ్డన నేపథ్యంలో ఈ ఒప్పందాలపై నీలినీడలు కమ్ముకున్నాయని రక్షణ శాఖకు చెందిన అధికారులిద్దరు వ్యాఖ్యానించారు. రాతపూర్వకంగా అమెరికా నుంచి కొత్త ఆయుధాల కొనుగోళ్ల నిలిపివేతపై ఉత్తర్వులు వెలువడలేదని, అయినప్పటికీ ఈ వ్యవహారంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని చెబుతున్నారు. టారిఫ్‌ల నిర్ణయం ఓ కొలిక్కి.. ద్వైపాక్షిక సంబంధాల దిశపై స్పష్టత వచ్చిన తర్వాత ఒప్పందాలు కొనసాగే అవకాశం కనిపిస్తోందని ఆ అధికారులు తెలిపారయని రాయిటర్స్ కథనం ఇచ్చింది. దీనిపై ఇటు భారత రక్షణ మంత్రిత్వ శాఖ.. అటు పెంటగాన్ అధికారికంగా స్పందించాల్సి ఉంది.



# వృద్ధుడు.. నలుగురు మహిళలు.. ఇవేం ట్విస్టులు రా సామీ!

**ముంబై:** సైబర్ నేరాలపై ప్రభుత్వాలు, పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. సైబర్ మోసగాళ్ల చేతిలో అమాయకులు సులభంగా మోసపోతున్నారు. దేశంలో రోజురోజుకు ఇలాంటివి అనేక ఘటనలు వెలుగుచూస్తున్నాయి. యువతే కాదు.. వృద్ధులు సైతం వలపు వలలో పడుతున్నారు. వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా ముంబైలో 80 ఏళ్ల వ్యక్తి ఫ్రెండ్ రిక్వెస్ట్ అంగీకరించి.. సైబర్ మోసానికి గురై రూ.9 కోట్లు పోగొట్టుకున్నాడు. ముంబైకి చెందిన వృద్ధుడు 2023 సంవత్సరం ఏప్రిల్ నెలలో ఫేస్‌బుక్‌లో షార్వి అనే మహిళకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించగా.. ఆ రిక్వెస్ట్ అంగీకరించలేదు. అయితే, కొన్ని రోజుల తర్వాత షార్వి ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. దీంతో ఆ వృద్ధుడు అంగీకరించాడు. ఇద్దరూ చాటింగ్ ప్రారంభించారు. ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పుడే అసలు కథ మొదలైంది. తన భర్త నుంచి దూరమై పిల్లలతో ఉన్నట్లు నాటకానికి తెర తీసింది. ప్రస్తుతం తన పిల్లలు అనారోగ్యంతో ఉన్నారని.. తనకు కొంత డబ్బు అవసరం అంటూ వాపోయింది. దీంతో కరిగిపోయిన ఆ వృద్ధుడు నగదును పంపించాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల తర్వాత కవిత అనే మహిళ వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపడం ప్రారంభించింది. షార్వి స్నేహితురాలిగా పరిచయం చేసుకున్న ఆమె. ఆ వృద్ధుడికి అసభ్యకర సందేశాలు పంపడం ప్రారంభించింది. అనంతరం డబ్బు డిమాండ్ చేయడం మొదలుపెట్టింది.

ఇదిలా ఉండగా.. మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. షార్వి సోదరి నంటూ మరో మహిళా దివాజ్ సందేశాలు పంపించడం మొదలు పెట్టింది. షార్వి చనిపోయిందని.. ఆస్పత్రి బిల్లు చెల్లించాలని స్క్రీన్ షాట్‌లు కూడా పంపించింది. దీంతో ఆ వృద్ధుడు డబ్బులు పంపించాడు. అనంతరం తిరిగి దినాజ్‌ను డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఇదిలా సాగుతుండగా..

ఇంతలోనే జాస్మిన్ అనే మరో మహిళ మెసేజ్ పంపించింది. దినాజ్ స్నేహితురాలినంటూ సాయం చేయాలని అభ్యర్థించింది. దీంతో ఆమెకు కూడా ఆ వృద్ధుడు డబ్బు పంపించాడు. ఇలా ఏప్రిల్ 2023 నుంచి జనవరి 2025 వరకు రూ. 8.7 కోట్లు పంపించాడు. ఇంతటితో ఆ వృద్ధుడు ఆగలేదు.. ఇక ఖాతాలో నగదు అయిపోవడంతో కోడలి దగ్గర రూ.2లక్షలు అప్పుతీసుకున్నాడు. మరింత డబ్బు కావాలంటూ ఆ మహిళలు కోరడంతో కుమారుడి దగ్గర కూడా రూ. 5 లక్షలు అడిగాడు.

దీంతో అనుమానం వచ్చి కొడుకు తండ్రిని నిలదీయగా.. ఆ డబ్బు ఎందుకు అవసరమో చెప్పాడు. దీంతో అసలు విషయం బయటపడింది. చివరికి మోసపోయానని తెలుసుకున్న ఆ వృద్ధుడు ఆస్పత్రి పాలయ్యాడు. మోసంపై జూలై 22న సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వృద్ధుడిని మోసం చేసిన నలుగురు మహిళలు తెలిసిన వారై ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## చిటపట చినుకుల్లో అమ్మాయి

# క్రేజీ స్టంట్, చివరకు..

''స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంది. ఏదో ఒక వీడియో క్రేజీగా చేసేద్దాం. వీలైతే వైరల్ అయిపోదాం'' అనే ఆలోచనకు వయసు నిమిత్తం లేకుండా పోతోంది. చిన్నపిల్లాడి దగ్గరి నుంచి పండు ముసలిదాకా.. ఏదో ఒక వీడియోతో ఓవర్‌నైట్‌లో ఫేమ్ అయిపోవడం(ఆ ఒక్క వీడియోతోనే) చూస్తున్నాం కూడా. అలా.. ఇక్కడ ఓ అమ్మాయి అనుకుంది. కానీ, ఆ ఆలోచన బెడిసి కొట్టింది. జోరుగా వాన పడుతోంది. ఆ వానలో ఓ అమ్మాయి సరదాగా రీల్ చేయాలని అనుకుంది. అయితే కారెక్కి కూర్చుని చేస్తే క్రేజీగా ఉంటుందని భావించింది. ఆమె స్నేహితుడు వాహనం నడుపుతుంటే.. ఆమె ఆ వాహనం టాప్ మీద కూర్చుని వానలో ఫోన్‌లో సెల్ఫీలు దిగుతూ మురిసిపోయింది. ఆ డేంజరస్ స్టంట్‌ను ఆ దారినపోయే కొందరు వీడియో తీశారు. దానిని నెట్టింట వదిలారు అంతే.. గురుగ్రామ్ పోలీసులు ఆ వీడియోకు స్పందించారు. జాతీయ హైవే 48 మీద ఆ ఘటన జరిగిందని నిర్ధారించుకున్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించినందుకు గురువారం కేసు నమోదు చేశారు.



ఇప్పటికే ఆ రీల్ స్టంట్ కోసం వాడిన వాహనాన్ని సీజ్ చేశారు. తనకు తెలియకుండా తన కొడుకు తన కారును తీసుకెళ్లాడని ఆ తండ్రి చెబుతున్నాడు. కారు నడిపిన ఆ యువకుడు, పైన కూర్చున్న అమ్మాయి ఇద్దరూ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరలో వాళ్లను అరెస్ట్ చేస్తామని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి ప్రమాదకరమైన వీడియోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతారో తెలియదుగానీ.. కటకటాలు మాత్రం లెక్కించాల్సి వస్తోందని పలువురు కామెంట్లు పెడుతున్నారు.

# మరో అమృత్ భారత్‌కు పచ్చజెండా..




**న్యూఢిల్లీ:** దేశంలో నేటి(శుక్రవారం) నుంచి మరో అమృత్ భారత్ రైలు పరుగులు తీయనుంది. బీహార్‌లోని సీతామర్హిని ఢిల్లీకి అనుసంధానించే ఈ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర హోంమంత్రి అమిత్ షా జెండా ఊపి ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బీహార్‌లో రైలు కనెక్టివిటీని మెరుగుపరచనుంది. అలాగే మధ్యతరగతి వర్గానికి ఆధునిక రైల్వే సేవల అనుభవాన్ని అందించనుంది. సీతామర్హిఢిల్లీ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర హోంమంత్రి అమిత్ షా సీతామర్హిలోని పునౌరా ధామ్ నుండి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా జెండా ఊపి ప్రారంభించనున్నారని తూర్పు మధ్య రైల్వే జోన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఢిల్లీసీతామర్హి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 20 గంటల 45 నిమిషాల్లో దాదాపు 1,100 కి.మీ దూరాన్ని కవర్ చేస్తుంది. ఇది గంటకు గరిష్టంగా 130 కి.మీ వేగంతో పరుగుల తీయగలదు. ఈ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వారానికి ఒకసారి నడుస్తుంది. ఇది శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఢిల్లీ నుండి బయలుదేరి, ఆదివారం ఉదయం 10.45 గంటలకు సీతామర్హి చేరుకుంటుంది. ఆదివారం రాత్రి 10.15 గంటలకు సీతామర్హి నుండి బయలుదేరి, సోమవారం రాత్రి 10.40 గంటలకు ఢిల్లీకి తిరిగి వస్తుంది. ఢిల్లీసీతామర్హి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు 13 స్టాప్‌లున్నాయి. అవి ఘజియాబాద్, తుండ్ల, కాన్పూర్, లక్నో, గోండా, బస్తీ, గోరఖ్‌పూర్, కప్తాన్‌గంజ్, సిస్వా బజార్, బాగహా, సిక్తా, నర్కటియాగంజ్, రక్సౌల్ బైర్గానియా.

08 మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 09-08-2025

# టాలీవుడ్ ఫిల్మ్ ఛాంబర్ సంచలన ప్రకటన




టాలీవుడ్ ఫిల్మ్ ఛాంబర్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఎలాంటి షూటింగ్‌లు జరపొద్దని నిర్ణయించింది. ఎలాంటి సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇవ్వొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. తెలుగు సినీ పరిశ్రమలోని 24 విభాగాల ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్ల ఏకపక్షంగా సమ్మెకు పిలుపునివ్వడంతో ఫిల్మ్ ఛాంబర్ ఈ నిర్ణయం తీసుకుంది. వారితో ఎలాంటి చర్చలు, సంప్రదింపులు చేయకుండా తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు దూరంగా ఉండాలని సూచించింది. అంతేకాకుండా స్టూడియోలు, ఔట్‌డోర్ యూనిట్లు, మౌలిక వసతుల యూనిట్ సభ్యులు, తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి అనుమతి లేకుండా ఎలాంటి సేవలూ అందించకూడదని తెలిపింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ స్పష్టం చేసింది.




# నాని ద ప్యారడైజ్ ఫస్ట్ లుక్ చూశారా?


సినిమా సినిమాకు వైవిధ్యం చూపిస్తున్న నాని.. ఇప్పుడు మరోసారి క్రేజీ పాత్రతో రాబోతున్నాడు. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రస్తుతం నాని 'ద ప్యారడైజ్' మూవీ చేస్తున్నాడు. ఇదివరకే ఈ చిత్రం నుంచి గ్లింప్స్ రిలీజైంది. కాకపోతే నాని ఫేస్ రివీల్ చేయలేదు. ఇప్పుడు పూర్తిగా ముఖాన్ని చూపిస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. అలానే పాత్ర పేరుని కూడా బయటపెట్టారు. ఫుల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న 'ప్యారడైజ్'లో నాని.. రెండు జడలతో కనిపించబోతున్నాడు. ఈ పాత్రకు జడల్ అనే పేరు ఫిక్స్ చేశారు. ఈ క్రమంలోనే తాజాగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. వారం పది రోజుల క్రితమే దీన్ని సోషల్ మీడియాలో పంచుకోవాలనుకున్నారు. కానీ 'కింగ్డమ్' రిలీజ్, తర్వాత సినీ కార్మికుల సమ్మె కారణంగా వాయిదా పడింది. ఇప్పుడు ఎట్టకేలకు షేర్ చేశారు. ఇందులో నాని సరసన కాయదు లోహర్ హీరోయిన్ అని రూమర్స్ వస్తున్నాయి. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. అలానే హిందీ నటుడు రాఘవ్ జుయెల్ విలన్ కాగా.. మోహన్ బాబు, బాబు మోహన్ ప్రతినాయక పాత్రల్లో కనిపించబోతున్నారని టాక్. అనిరుధ్ సంగీతమందిస్తున్నాడు. ఇప్పటికే గ్లింప్స్ కోసం ఇచ్చిన మ్యూజిక్ ఎంత వైరల్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వచ్చే ఏడాది మార్చి 26న మూవీ పాన్ ఇండియా వైడ్ థియేటర్లలోకి రానుంది.

# నా ఇబ్బందిని అస్సలు పట్టించుకోలేదు

టాలీవుడ్ లెజెండ్, లయన్ చిత్రాల్లో మెప్పించిన నటి రాధికా ఆప్టే. తెలుగులో రక్త చరిత్ర మూవీతో ఎంట్రీ ఇచ్చింది. అంతకుముందే బాలీవుడ్ సినిమాతో అరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ పలు సూపర్ హిట్ చిత్రాల్లో కనిపించింది. బాలీవుడ్‌తో పాటు తమిళం, మరాఠీ, బెంగాలీ సినిమాల్లో మెప్పించింది. చివరిసారిగా సిస్టర్ మిడ్‌నైట్ చిత్రంలో కనిపించింది. అయితే రాధికా ఆప్టే లండన్‌కు చెందిన మ్యూజిషియన్ బెనెడిక్ట్ టేలర్‌ను 2012లో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంది. సినిమాలతో ఎప్పుడు బిజీగా ఉండే రాధికా.. పెళ్లయిన పదేళ్ల తర్వాత ప్రెగ్నెన్సీ ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. తాజాగా నేహా ధూపియా నిర్వహిస్తోన్న ఫ్రీడమ్ టు ఫీడ్ లైవ్ సెషన్‌కు హాజరైన ముద్దుగుమ్మ.. తాను గర్భం ధరించాక ఎదురైన అనుభవాలను పంచుకుంది.

మొదటి ట్రైమిస్టర్‌లో సినీ ఇండస్ట్రీలో ఎదుర్కొన్న సంఘటనలను పంచుకుంది. గర్భంతో ఉన్నప్పటికీ సెట్‌లో ఎలాంటి సానుభూతి చూపలేదని బాధను వ్యక్తం చేసింది. మొదటి మూడు నెలల్లో తను అనుభవించిన భావోద్వేగం, గందరగోళం, నిరాశ లాంటి ఫీలింగ్స్ వచ్చాయని తెలిపింది. ఆ సమయంలో ఓ నిర్మాత తనతో వ్యవహరించిన తీరుతో చాలా ఇబ్బంది పడ్డానని వివరించింది. రాధికా ఆప్టే మాట్లాడుతూ..' ఆ నిర్మాతకు నేను గర్భం ధరించడం ఇష్టం లేదనుకుంటా. నాకు చాలా అసౌకర్యం , ఇబ్బందిగా ఉందని చెప్పినా బిగుతుగా ఉండే దుస్తులు ధరించాలని పట్టుబట్టాడు. నా మొదటి త్రైమాసికంలో నేను కాస్తా ఎక్కువగానే తింటున్నా. అప్పుడు నా శరీరంలో విపరీతమైన మార్పులొచ్చాయి. కానీ నా పరిస్థితిని అర్థం చేసుకోకపోవడంతో అసహనానికి గురయ్యా. అదే షూటింగ్ సెట్‌లో నొప్పితో పాటు అసౌకర్యంగా ఉన్నప్పుడు వైద్యుడిని కలిసేందుకు కూడా నన్ను అనుమతించలేదు. అది నన్ను చాలా నిరుత్సాహపరిచింది. వృత్తిపరంగా నిబద్ధతగానే ఉండాలని తెలుసు. ఆ విషయాన్ని ఎల్లప్పుడు గౌరవిస్తా. కానీ ఇలాంటి టైమ్‌లో కొంచెం సానుభూతి కూడా అవసరం' అని తన బాధను పంచుకుంది.





# పరమ్ సుందరిగా జాన్వీ కపూర్..

సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్ జంటగా నటిస్తోన్న తాజా చిత్రం 'పరమ్ సుందరి'. ఈ సినిమాకు తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తున్నారు. మాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లో దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని ఫుల్ రొమాంటిక్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బీగీ శారీ అంటూ సాగే రొమాంటిక్ పాటను రిలీజ్ చేశారు. ఈ సాంగ్‌లో సిద్ధార్థ్ జాన్వీల కెమిస్ట్రీ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. వర్షంలో చేసిన ఈ పాట ఈ చిత్రానికి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ అద్భుతమైన సాంగ్‌ను శ్రేయా ఘోషల్, అద్నాన్ సమీ, సచిన్ జిగర్ ఆలపించారు. ఈ పాటకు అమితాబ్ భట్టాచార్య లిరిక్స్ అందించగా.. సచిన్ జిగర్ కంపోజ్ చేశారు. ఈ సినిమా ఆగస్టు 29న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రాన్ని రొమాంటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com